J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 44 సంచిక : 26 29.11.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి




# అటకెక్కుతున్న అంబేడ్కర్ రాజ్యాంగం!

- సొంత రాజ్యాంగాలని అమలుచేస్తున్న నేతలు
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న రాజకీయ పార్టీలు
- నియంతృత్వ పోకడలతో.. జడుస్తున్న జనం

*నవంబర్ 26వ తేదీని రాజ్యాంగ దినోత్సవంగా మన ప్రభుత్వాలు ప్రకటించుకున్నాయి. ఢిల్లీ నుండి గల్లీ వరకూ ఘనంగా సంబరాలు కూడా జరుపుకున్నాయి. మన రాజ్యాంగానికి మించింది మరెక్కడాలేదని గొప్పలు చెప్పుకున్నాయి. నేతలు, అధికారుల ఉపన్యాసాలతో మైకులు హోరెత్తాయి.*

'భారత రాజ్యాంగం' అంటే... దేశంలో అత్యంత విలువైన, పవిత్రమైన, అత్యున్నతమైన పరిపాలనా పత్రం. ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత నియమ నిబంధనల గ్రంథం. స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత మనకి మనమే రూపొందించుకున్న నియమావళే రాజ్యాంగం. దేశంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధివిధానాలు ఎలా ఉండాలి, పరిపాలన ఏవిధంగా సాగాలి అన్నది ప్రధానాంశంగా రాజ్యాంగం రూపొందించబడింది. శాసన, న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థలు ఎలా పనిచేయాలన్నది మన రాజ్యాంగం సూచిస్తుంది. ఆయా సంస్థల బాధ్యతలు, వాటి మధ్య సమన్వయం పరస్పరం సహకరించుకుంటూ ఆ విభాగాలు ఎలా నడుచుకోవాలో మన రాజ్యాంగంలో పొందుపరచబడింది. దేశ దశ దిశ నిర్దేశించే నియమావళిగా 1949 నవంబర్26న మన రాజ్యాంగం రూపొందించబడింది. డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ అధ్యక్షతన 7మందితో కూడిన బృందం అప్పట్లో రాజ్యాంగాన్ని తయారుచేసింది. ఆ తరువాత రెండు నెలలకి 1950 జనవరి 26 నుండి ఆ రాజ్యాంగం అమలులోకి వచ్చింది. ఆరోజు నుండే మన దేశం జనవరి 26ని గణతంత్ర దినోత్సవంగా జరుపుకుంటోంది.

10లో

8 లో

## మహారాష్ట్రలో.. మహాయుతి.. మహాయుక్తి
## జార్ఖండ్‌లో.. వికటించిన వ్యూహం








## ప్రశాంతమ్మకి.. అనితమ్మ శుభాకాంక్షలు

నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సతీమణి, తిరుమల తిరుపతి దేవస్థానాల పాలకమండలి సభ్యురాలు, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి పుట్టినరోజు (ఈనెల 22) సందర్భంగా శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. రాష్ట్ర హోంమంత్రి అనితమ్మతో పాటు, సహచర మహిళా ఎమ్మెల్యేలు ప్రశాంతమ్మకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అసెంబ్లీ ప్రాంగణంలో ప్రత్యేకంగా కేకు ఏర్పాటు చేసి కట్ చేయించి అందరికీ పంచారు. ఆనందోత్సాహాల మధ్య ప్రశాంతిరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి.

# నిస్వార్థ ప్రజాసేవకులు వేమిరెడ్డి దంపతులు



- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య

ప్రశాంతిరెడ్డి జన్మదినోత్సవ వేడుకలను తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఈనెల 22న అట్టహాసంగా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహం వద్ద కార్యాలయ సిబ్బందికి నూతన వస్త్రాలు, మిఠాయిలు పంపిణీ చేశారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య కేక్‌ను కట్ చేసి, ప్రశాంతిరెడ్డికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద వర్గాలకు, బలహీన వర్గాలకు సాయం చేయాలనే మంచి ఆలోచనతోనే వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి ప్రశాంతిరెడ్డిలు రాజకీయాల్లోకి వచ్చారన్నారు. నెల్లూరుజిల్లాలోని 10స్థానాల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధించిందంటే, అందులో ప్రధానపాత్ర వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కుటుంబానిదేనన్నారు. నిస్వార్థంగా తమ స్వార్జితం తోనే పేదలకు, అన్నార్తులకు సాయం చేసి ఆదుకునే కుటుంబం వేమిరెడ్డి కుటుంబమని కొనియాడారు.

### జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన స్పీకర్ :

కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపింది. సభ ప్రారంభం కాగానే, సభలో ఉన్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని ఉద్దేశించి స్పీకర్ అయ్యన్నపాత్రుడు 'ఈ రోజు మీ బర్త్‌డే కదా' అనడంతో, సభ్యులంతా ఒక్కసారిగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి వైపు చూశారు. పుట్టినరోజున కూడా సభకు హాజరైన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అంకితభావాన్ని స్పీకర్ ప్రశంసిస్తూ, ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. శాసనసభలో ఉన్న మంత్రులు, సహచర శాసనసభ్యులు కూడా ఆమెకు 'హ్యాపీ బర్త్‌డే' అంటూ శుభాకాంక్షలు చెప్పారు.

### పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో ప్రశాంతిరెడ్డి సమావేశమై, కోవూరు నియోజకవర్గం సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా పవన్ ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పారు.

అనంతరం, పంచాయతీరాజ్‌కు సంబంధించి గ్రామీణ రోడ్లు, ఉపాధి హామీ పనులు వంటి అంశాలను ఆమె ప్రస్తావించారు. కోవూరు నియోజకవర్గంలోని గ్రామాల సమస్యలను పరిష్కరించి, వాటిని అభివృద్ధి చేయడంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఆమె ఉప ముఖ్యమంత్రికి విన్నవించారు.



## పవన్‌ను కలసిన..దినేష్‌రెడ్డి

రాష్ట్ర ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా కొత్తగా బాధ్యతలు చేపట్టిన, కోవూరు నియోజకవర్గ టీడీపీ నేత.. పోలంరెడ్డి దినేష్‌రెడ్డి ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ని కలిసి పర్యావరణానికి సంబంధించిన పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకువెళ్ళారు. ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్‌కు అన్నివిధాల సహకారం అందిస్తామని పవన్ ఈ సందర్భంగా దినేష్‌రెడ్డికి తెలియజేశారు.

## ఎన్‌సిసి విద్యార్థుల రక్తదానం



ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ..నెల్లూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలోని రక్తనిధి కేంద్రం ఆధ్వర్యంలో ఇటీవల 2(ఏ) ఈఎంఈ ఎన్‌సిసి యూనిట్‌కు చెందిన 43 మంది ఎన్‌సిసి విద్యార్థులు రక్తదానం చేసి తమ సేవాభావం చాటుకున్నారు. లెఫ్టినెంట్ కల్నల్ ఎన్.దినేష్, సుబేదారు రజిత్‌సేన్ గుప్తా, కృష్ణచైతన్య డిగ్రీ కాలేజీ సి.టి.ఓ సి హెచ్.ప్రసాద్, రావూస్ డిగ్రీ కాలేజీ లెఫ్టినెంట్ ఏఎన్‌ఓ బి. పెంచలప్రసాద్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ సి.టి.ఓ ఎన్.సురేశ్‌ల సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. డా.ఎస్.వరప్రసాద్, బి.భాస్కర్ రావు, ఏ.కృష్ణవేణి, ఎం.వెంకటేష్, రెడ్ క్రాస్ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

## తాతయ్యబడిలో 'అమ్మ పేరుతో ఓ మొక్క'



నెల్లూరులోని నెహ్రూ యువ కేంద్ర, కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, జిల్లా యువజన సర్వీసుల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 25న స్థానిక వెంగళరావునగర్ మునిసిపల్ ఉన్నత పాఠశాల (తాతయ్యబడి)లో 'అమ్మ పేరు మీద ఒక మొక్క' నాటే కార్యక్రమం నిర్వహించారు. తొలుత, ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భారతి మొక్కను నాటారు. ముఖ్య అతిథిగా సెట్నెల్ సీఈవో బి.శ్రీనివాసరావు, జిల్లా యువజన అధికారి ఎ.మహేందర్‌రెడ్డి, పీహెచ్‌పి జిల్లా నాయకులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ షేక్ రసూల్, పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం భూషణ్‌కుమార్ పాల్గొన్నారు.

## మీ వాక్కులే.. మాకు ఋక్కులు



**బొగ్గరపు రాధాకృష్ణమూర్తి**
నెల్లూరు. సెల్ : 9885481939

ఎన్ని నోములు నోచి కన్నారో
మిమ్మల్ని మీ తల్లిదండ్రులు
ఎంత ప్రేరణ పొందుతున్నారో
మీ వల్ల మన తెలుగు ప్రజలు...
అద్వితీయమైన వాక్పటిమతో
ప్రజల మేలు కోసం నిరంతరం
మీరు ఆధ్యాత్మికతను బోధిస్తున్నారు...
అద్వితీయమైన పాండిత్యంతో
ఆబాలగోపాలానికి
పరమాత్మతత్వాన్ని తెలియజేస్తున్నారు
ప్రజల్లో భక్తితత్వాన్ని పెంపొందిస్తున్నారు...
బ్రహ్మశ్రీ 'శ్రీ చాగంటి' గారూ!
మీకు శతకోటి నమోవాకాలు
మీ ప్రతిభాపాటవాలు అనన్యసామాన్యం
మీ ఆధ్యాత్మిక సేవలు గర్వకారణం
మీరే.. నేటి కాలంలో అసలైన సద్గురువులు
ఆత్మజ్ఞానం.. దైవజ్ఞానం కలిగిన
మీరే.. ఋషులు.. మహర్షులు..
కలకాలం ప్రతిధ్వనించే
మీ వాక్కులు.. మాకు ఋక్కులు
చిరకాలం పుడమిన వర్ధిల్లే.. వేద వాక్కులు!

(బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన సందర్భంగా...)

## మాదకద్రవ్యాలకి దూరంగా ఉండాలి

విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకి దూరంగా ఉండాలని, దురలవాట్లకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని ఆత్మకూరు సీఐ గంగాధర్ చెప్పారు. నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఇటీవల నందవరం ఆదర్శపాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులతో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను ఆయన విద్యార్థులకు వివరించారు. మాదకద్రవ్యాలు కలిగివున్నా, విక్రయించినా నేరమని, బంగారం లాంటి భవిష్యత్తును పాడు చేసుకోవద్దని స్పష్టం చేశారు. సర్వోదయ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ టైటస్ నిర్మలకుమార్, జిల్లా యువజన అధికారి ఏ. మహేంద్రరెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, మర్రిపాడు ఎస్ఐ శ్రీనివాసులు, వై.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## చాటుపద్యం విశిష్టమైనది

డా. నందనవనం శ్రీనివాసరావు

తెలుగు సాహిత్యంలో చాటుపద్యం ఎంతో విశిష్టమైనదని, అందులో సమయస్ఫూర్తి, హాస్యం, చమత్కారం మొదలైనవి కలిసి ఉంటాయని గుంటూరు హిందూ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ నందనవనం శ్రీనివాసరావు చెప్పారు. నగరంలోని టౌన్‌హాల్ ఆవరణలోని వర్ధమాన సమాజం హాల్‌లో ఇటీవల చేతన సంగీత, సాహిత్య, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన 'చాటుపద్యం-హాస్యం' అనే అంశంపై ప్రసంగించి, ప్రాచీన మరియు ఆధునిక కవులు రచించిన చాటుపద్యాలను ఆలపించారు. అనంతరం నిర్వాహకులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. పద్యకళా పరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్, చేతన కార్యదర్శి వై. శేషగిరీశం, డాక్టర్ శ్రీనివాసరావు, ఏ.జయప్రకాష్, నలుబోలు బలరామయ్యనాయుడు, సుభద్రాదేవి, చలంచర్ల భాస్కర్ రెడ్డి, వై.విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు. వికాస్ విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం సభను నిర్వహించారు.

## 4న చెన్నైలో..ఘంటసాల జయంతి



తమిళనాడు తెలుగు సాంస్కృతిక సంఘం, జనని సాంఘిక సాంస్కృతిక సమితిల సంయుక్త ఆధ్వర్యంలో డిసెంబరు 4వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు చెన్నైలో అమరగాయకుడు ఘంటసాల 102వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని జనని ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య తెలిపారు. చెన్నైలోని పెరంబూరు రైల్వేస్టేషన్ వద్దనున్న శ్రీ ముక్కాల నమ్మాళ్వార్‌శ్రేష్ఠి ఆడిటోరియంలో, తమిళనాడు తెలుగు సాంస్కృతిక సంఘం కార్యదర్శి పిఆర్ కేశవులు నిర్వహణలో జరిగే ఈ కార్యక్రమానికి 'జనని' సంస్థ అధ్యక్షులు డాక్టర్ నిర్మల పళనివేలు అధ్యక్షత్వం వహిస్తారని పేర్కొన్నారు. తమిళనాడు తెలుగు సాంస్కృతిక సంఘం అధ్యక్షులు తమ్మినేని బాబు, రెప్కో బ్యాంక్ విశ్రాంత జనరల్ మేనేజర్ వంజరపు శివయ్య, ప్రముఖ గాయకులు ఎంఆర్ సుబ్రహ్మణ్యం, ఆకాశవాణి-చెన్నై కేంద్రానికి చెందిన పెద్దాడ సాయి సూర్య సుబ్బలక్ష్మి వక్తలుగా పాల్గొంటారని, ఈ సందర్భంగా సుప్రసిద్ధ గాయకులు ఎంఆర్ సుబ్రహ్మణ్యం బృందం వారిచే సంగీత విభావరి ఉంటుందని, ఘంటసాల అభిమానులందరూ తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

# ముడుపుల వ్యవహారాలతో.. ఇంటాబయటా రచ్చ రచ్చ!

## అదాని - జగన్‌లపై దేశవ్యాప్తంగా చర్చ

విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందంలో వేల కోట్ల రూపాయల ముడుపులు చేతులు మారాయంటూ ప్రముఖ పారిశ్రామికవేత్త అదానిపై వచ్చిన అభియోగాలు దేశంలో పెద్దఎత్తున దుమారాం రేపుతున్నాయి. దీంతో మొన్న ప్రారంభమైన పార్లమెంట్ శీతాకాల సమావేశాలు కూడా హాట్ హాట్‌గా మారుతున్నాయి. మంగళ, బుధ వారాల్లో విపక్ష సభ్యులు అదానిపై వచ్చిన అభియోగాలపై చర్చ జరగాలంటూ పట్టుబట్టడంతో సమావేశాలు వాయిదా పడ్డాయి. అదానిపై వచ్చిన ఆరోపణల తీవ్రతను నీరుగార్చేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందంటూ కాంగ్రెస్ నేతలు రాహుల్‌గాంధీ తదితరులు ధ్వజమెత్తు తున్నారు. దేశంలో పెద్ద సంచలనంగా మారిన ఈ వ్యవహారంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరు కూడా ప్రస్తావనకు వస్తుండడంతో రాష్ట్రంలోనూ ఇది సంచలనమైంది. దీంతో జగన్ అవినీతి బాగోతం కూడా బట్ట బయలైందంటూ తెలుగుదేశం నేతలు విమర్శలకు దిగారు.

# జగన్‌రెడ్డి అవినీతి గుట్టు రట్టయ్యింది!

## - రాష్ట్ర ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మెన్ ఆనం వెంకటరమణారెడ్డి



విద్యుత్ కొనుగోళ్లలో జగన్ అవినీతిని అమెరికా ఎఫ్‌బిఐ గుర్తించిందని రాష్ట్ర ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మెన్, టీడీపీ నేత ఆనం వెంకటరమణా రెడ్డి అన్నారు. ఆ కేసులో జగన్‌మోహన్‌రెడ్డి తప్పించుకోలేరని ఆయన చెప్పారు. ఈ నెల 27న మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అదానీ ముడుపుల వ్యవహారంలో అమెరికాలో ఎఫ్‌బీ, సెక్యూరిటీస్ అండ్ ఎక్ఛేంజ్ కమిషన్ విచారణ జరిపిస్తుం దని చెప్పారు. అదాని సంస్థ నుంచి జగన్ రెడ్డికి పెద్దఎత్తున ముడుపులందాయని కూడా అక్కడి ఎఫ్‌బిఐ గుర్తించిందన్నారు. అవినీతిలో జగన్‌రెడ్డికి మించినవాళ్ళు మరెవరూ లేరని, కోట్లాదిరూపాయల లంచాలతో జగన్ అవినీతి ఇప్పుడు అంతర్జాతీయస్థాయికి చేరిందని ఆయన దుయ్యబట్టారు. అప్పటి ప్రభుత్వంలోని బడా వ్యక్తులు, ఐఏఎస్ అధికారుల పేర్లు కూడా ఎఫ్‌బిఐ ప్రస్తావించిందని, ఈ వ్యవహారంలో ప్రమేయమున్నవాళ్ళెవరూ కూడా తప్పించుకోలేరని ఆయన చెప్పారు. ఆ కేసును యునైటెడ్ స్టేట్స్ డిస్ట్రిక్ట్ కోర్టు, ఈస్టర్న్ డిస్ట్రిక్ట్ ఆఫ్ న్యూయార్క్‌లో విచా రించనున్నారని, జగన్ జీవితంలో ఆ కేసులనుంచి బయటపడలేరని ఆయన అన్నారు. 2014-19 మధ్య చంద్రబాబు నాయుడు హయాంలో విద్యుత్ ఒప్పం దాల్లో తప్పు జరిగిందంటూ అప్పట్లో విజయసాయిరెడ్డితో పాటు, ఐఏఎస్ అధికారులు అజయ్‌కల్లాం, శ్రీకాంత్ చంద్రబాబుపై లేనిపోని నిందారోపణలు చేశారని, ఇప్పుడు వాళ్లేమంటారని ఆయన ప్రశ్నించారు. ఇకనైనా వాళ్లు చంద్రబాబుకు క్షమాపణలు చెప్పాలన్నారు. అప్పట్లో మంత్రి బాలినేని ప్రమేయం లేకుండానే జగన్‌రెడ్డి ప్రభుత్వం అప్పటికప్పుడు కేబినెట్ సమావేశంలో పెట్టి ఆ ఒప్పందాన్ని ఆమోదించేసిందని ఆయన వివరించారు.

# ఆ ఒప్పందాన్ని రద్దుచేయండి

## - సీపీఎం నేత బీవీ రాఘవులు



గత ప్రభుత్వం అదానితో చేసుకున్న 'సెకి' (సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్) ఒప్పందాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రద్దు చేయాలని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు సూచించారు. ప్రజలపై దాదాపు లక్షకోట్ల భారంపడే ఆ విద్యుత్తు ఒప్పందాన్ని రద్దు చేయకుండా ముఖ్యమంత్రి ఎందుకు మౌనం వహిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఆ ఒప్పందాన్ని అప్పట్లోనే సీపీఎం వ్యతిరేకించిందని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈనెల 26న నెల్లూరులోని సీపీఎం కార్యా లయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, అమెరికాలో కేసులు నమోదైనా ఇక్కడ మాత్రం చర్యలు లేవని, కేంద్రం అదానీపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు మూలం రమేష్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



# పవన్ కళ్యాణ్ విందుకు..విపిఆర్

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ తెలుగు రాష్ట్రాల పార్లమెంట్ సభ్యులకు బుధవారం రాత్రి ఢిల్లీలో ఏర్పాటుచేసిన విందులో పాల్గొని, పవన్‌కళ్యాణ్‌ని అభినందిస్తున్న నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి.

# టిడ్కో స్థలాల ఆక్రమణలపై..అజయ్ ఆగ్రహం

## • వెంటనే తొలగించిన అధికారులు



టిడ్కో స్థలాలను ఆక్రమిస్తే సహించేది లేదని టిడ్కో ఛైర్మెన్ వేములపాటి అజయ్‌కుమార్ హెచ్చరించారు. నెల్లూరు లోని వెంకటేశ్వరపురం వద్ద టిడ్కోకాలనీలో ఉన్న ఖాళీస్థలాలను ఆక్రమించి, పలు మతాలకు చెందిన వారు ప్రార్థనామందిరాలను నిర్మాణం చేస్తున్నారన్న సమాచారంతో ఆయన వెంటనే స్పందించారు. రాష్ట్ర మునిసిపల్ మంత్రి పొంగూరు నారాయణతో సంప్రదించి, మునిసిపల్ అధికారులతో మాట్లాడి, వెంటనే జేసీబీతో ఆ ఆక్రమణలను తొలగింపజేశారు. ఎవరైనాసరే, టిడ్కో స్థలాలను దురాక్రమించాలని ప్రయత్నిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



## ఇళ్ళకి రక్షణ కల్పించాలంటూ..

# హోంమంత్రి అనితకి వినతి

గురువారం నాడు రాష్ట్ర హోంమంత్రి అనితని కలిసిన అజయ్, టిడ్కో ఇళ్ళకు రక్షణ కల్పించాలని కోరారు. 40వేలకి మించి జనాభా ఉన్న చోట ప్రత్యేక పోలీస్‌స్టేషన్లు, 10వేల జనాభా ఉండే చోట పోలీస్ ఔట్‌పోస్ట్‌లు పెట్టాలని అనితకి విజ్ఞప్తి చేశారు.

## 'అమరావతి రాజధాని'గా..

# కేంద్రం నుండి గెజిట్ తెప్పిస్తాం

## - పురపాలక మంత్రి నారాయణ



అమరావతిని రాజధానిగా ప్రకటించి, దానిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఆ మేరకు గెజిట్ విడుదలకు ప్రయత్నం చేస్తోంది. 'రాజధాని అమరావతి' అని గతంలోనే పార్లమెంటులో కేంద్రం స్పష్టంగా చెప్పిందని, ఆమేరకు కేంద్రం అధికారిక గెజిట్‌ను జారీ చేసేలా రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందని రాష్ట్ర పురపాలక శాఖమంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ వెల్లడించారు. ఇటీవల అమరావతిలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అమరావతిలో ఐదు ఐకానిక్ టవర్లు, అసెంబ్లీ, హైకోర్టు డిజైన్లను నార్మన్ పోస్టర్ సంస్థ గతంలో రూపొందించిందని, అయితే గత ప్రభుత్వం ఆ సంస్థ టెండర్‌ను, వారి డిజైన్లను రద్దు చేసిందని, అందుకే మళ్లీ ఆ భవనాల డిజైన్ల కోసం టెండర్లు పిలవగా ఆ టెండర్లు మరలా నార్మన్ పోస్టర్స్ సంస్థకే వచ్చాయని, సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో వాటికి ఆమోదాన్ని ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. త్వరలోనే వీటి తుది డిజైన్లకు సంబంధించిన ఉత్తర్వులు ఇస్తామన్నారు. రాజధాని ప్రాంతంలో నిర్మాణాలకు సంబంధించి పనులు త్వరలోనే మొదలవుతాయని, ప్రపంచ బ్యాంకు రుణానికి ఎలాంటి ఇబ్బంది లేదని, దశలవారీగా రుణం ఇచ్చేందుకు ప్రపంచ బ్యాంకు ఇప్పటికే ముందుకు వచ్చిందని ఆయన వివరించారు. రాష్ట్రంలో భవనాలు, లేఅవుట్ల అనుమతులు సులభతరం చేస్తూ రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకుందని మంత్రి నారాయణ చెప్పారు.

# బాబోయ్!..పులి!

## • పెంచలకోనలో చిరుత సంచారం

## • బెంబేలెత్తుతున్న యాత్రికులు, స్థానికులు



నెల్లూరుజిల్లా రాపూరు మండలం పెంచలకోనలో వెలసి వున్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం.. శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం సమీపంలో చిరుత సంచారం ప్రయాణీకులను, సందర్శకులను భయభ్రాంతులను చేస్తోంది. పెంచలకోన ప్రాంతమంతా దట్టమైన అటవీప్రాంతం కావడంతో అక్కడంతా జంతువుల సంచారం ఎక్కువ. అయితే, ఇటీవలికాలంలో ఎప్పుడూ లేనిది.. ఒక చిరుత అడవిలోంచి ఘాట్‌రోడ్డు మీదికి రావడంతో, ఆ చిరుత వల్ల ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయపడుతున్నారు. ఈనెల 27వ తేదీ రాత్రి అటవీ ప్రాంతంలోని ఆ మార్గంలో వాహనంలో ప్రయాణిస్తున్న సందర్శకులొకరు ఆ పులిని చూసి, వెంటనే దానిని ఫోన్‌లో చిత్రీకరించి, గట్టిగా హారన్‌కొట్టడంతో, అది రోడ్డుమీద నుంచి ఒక్క ఉదుటున అడవిలోకి పరుగుతీసింది. ఆ సందర్శకులు ఆ సమాచారాన్ని అధికారులకు తెలియజేశారు. అటవీశాఖ అతిథి గృహం వద్ద రోడ్డుమీద ఆ పులి సంచరిస్తున్న దృశ్యాలను చూసి ఆలయ అధికారులు, అటవీశాఖ అధికారులు వెంటనే రంగంలోకి దిగి, దాని జాడ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కొంతకాలం క్రితం తిరుమలలో కూడా పులులు యాత్రికులను భయాం దోళనలకు గురిచేయడం, ఓ బాలికను పులి చంపేయడం వంటి సంఘటనల నేపథ్యంలో, అటవీ అధికారులు అప్రమత్తయారు. పెంచలకోన అడవుల్లోకి ఆ పులి వెళ్ళిన దిశలో దాని అడుగు లను గుర్తించి, ఎటువెళ్ళిందో పరిశీలిస్తున్నారు. ప్రజలు కూడా జాగ్రత్తగా ఉండాలంటూ హెచ్చరిస్తున్నారు.

లాయర్
నవంబర్ 29, 2024

# రక్షణ లేని నీటి వ్యవస్థలు..ప్రజలకు తప్పని అవస్థలు!

'అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని ఉన్నట్లు' అనే పాత సామెతగా, మనదేశానికి అదేమి దురవస్థో తెలియదు కానీ, వనరులన్నీ పుష్కలంగా ఉన్నా వాటిని సంరక్షించుకోవడంలో ఏమాత్రం శ్రద్ధ ఉండడం లేదు. ముఖ్యంగా తాగే నీరు కూడా కలుషితమై జనానికి రోగాలు పెంచుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. దేశంలో నీటి వనరులకు కొదవ లేకున్నా, నదీనదాలు బోలెడన్ని ఉన్నా, వాటిని కాపాడుకోవడంలో మాత్రం ప్రభుత్వాలు ఎలాంటి చొరవ చూపకపోవడం విచారకరం. ఈ దుస్థితి ఇప్పుడు కాదు..ఏళ్ళతరబడిగా ఉంటూనే ఉంది. మనిషికి జీవనాధారాలైన నదులు, కాలువలు కాలుష్య కాసారాలుగా మారుతున్నా పాలకుల్లో చలనం ఉండడం లేదు. లక్షలు, కోట్లు ఖర్చుపెట్టి సురక్షిత మంచినీటి పథకాలు నిర్మించుకున్నా, వాటి పరిశుభ్రతను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. నదులు, కాలువలు ఆక్రమణలకు గురవుతున్నా, పరిశ్రమల నుంచి విషపూరిత రసాయనాలు వచ్చి కలుస్తున్నా, ఆ ప్రాంతాల్లోని చెత్తా చెదారమంతా తెచ్చి వాటిలో పోస్తున్నా పట్టించుకునే నాథులు లేరు. అసలు, నదులకు రక్షణ సదుపాయాలు కానీ, ఆయా ప్రాంతాల్లో మురుగునీటి పారుదల వ్యవస్థలు కానీ లేకపోవడం ఒక పెద్ద లోపం. అక్రమకట్టడాలను తొలగించి, నదులు కాలుష్యానికి గురికాకుండా ఇరువైపులా కాలుష్యానికి అందనంత దూరం రక్షణ గోడలు నిర్మించడం ఎంతో ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నా వినేవారెవరు లేకపోవడంతో నదులు, కాలువగట్లు పరిశుభ్రత లోపించి, ఎక్కడ చూసినా మురుగునీటి ప్రవాహాలతో, దుర్గంధంతో నిండిపోతున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలైతే కుప్పలు తెప్పలుగా పేరుకుపోయి, జలరాశుల్లోని జీవరాశులకీ ప్రమాదకరంగా పరిణమిస్తున్నాయి. కరకట్టలు నిర్మించి కాలువలకు, నదులకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వాలు ఎంతోకాలం నుంచి నిర్లిప్తంగా ఉండడంతో, వాటి దుస్థితి మారడం లేదు. జలజీవన్ మిషన్ వంటివి ఉన్నా, వాటికి నిధులు ఉండడం లేదు. స్థానిక అధికారయంత్రాంగాలు, గ్రామ ప్రాంతాల్లో ఉన్న పంచాయతీల వద్ద నిధులు లేకపోవడంతో వాటి రక్షణ గాలిలో దీపమైంది. మహానగరాలు, పట్టణాల్లో సైతం ఆ 'మురుగు నదులే' చివరికి మనిషి పాలిట మృత్యుకూపాలుగా కూడా మారుతున్నాయి. అపారమైన జలనిధులతో జలజలా ప్రవహించే అమృతమయమైన ఎన్నో జీవనదులు.. పుణ్యనదులకు కూడా ఈ దుర్గంధం తప్పకపోవడం ఎంత బాధాకరం!.. దీనికిక అంతం లేదా అనిపిస్తోంది. అంతే కాదు, ప్రజలకు కుళాయిల ద్వారా ఆయా నదులు లేదా నీటివనరుల నుంచి నిత్యం సరఫరా అయ్యే మంచినీటిని సక్రమంగా శుద్ధి చేయకపోతుండడంతో అనేకప్రాంతాల్లో ప్రజలు కలుషిత నీరే తాగుతూ, నానా రకాల వ్యాధుల బారిన పడాల్సివస్తోంది. రక్షిత మంచినీటి పథకాల పరిశుభ్రత, కుళాయిల బాగోగుల పట్ల కూడా ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేకపోవడం బాధాకరం!.. వానలు, వరదల సమయంలో ఆ నీరంతా సముద్రంలో వృథాగా కలసిపోకుండా ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి, చెక్‌డ్యామ్‌లు వగైరాల ద్వారా పదిలపరచుకోవాలనే ఆలోచనలు ప్రభుత్వాలకున్నా, నేటికీ అవి ఆశించిన స్థాయిలో ఆచరణకు రాకపోవడం మరో దురదృష్టం!.. ఇదిలావుంటే, మరోవైపు..తాగేందుకు గుక్కెడు మంచినీళ్ళు కూడా దొరక్క దేశంలోని అనేక ప్రాంతాల ప్రజలు అల్లాడుతున్నారు. ముఖ్యంగా అధికశాతం పల్లెటూళ్ళలో, మురికివాడల్లో, గిరిజన-దళిత కాలనీల్లో, మెట్టప్రాంతాలు, బడుగు బలహీనవర్గాలవారు నివసిస్తున్న ఊళ్ళల్లో పేదప్రజలు మంచినీటి కోసం ఎన్ని కష్టాలుపడుతున్నారో చెప్పలేం. నీళ్ళు పుష్కలంగా లభించే ప్రాంతాల్లో నిత్యం నీటివృథా లెక్కలేకుండా జరిగిపోతూనే ఉండడం, లేనిచోట బాధలు పడుతుండడం సర్వసాధారణమైపోయింది. ఇలా చెప్పుకుంటూపోతే ఆ క'న్నీటి' కథలకు, వెతలకు అంతే ఉండదు. ఏదేమైనా, నదులను కేవలం నీటి వనరులుగానే కాక, పవిత్రమైన నదీమతల్లులుగా కూడా భావిస్తుంటాం కానీ, వాటిని కలుషితం కాకుండా చూసుకోలేకపోతున్నాం. ఇకనైనా ఆ దురవస్థ తొలగిపోవాలి. ప్రభుత్వాలు వీటిపై దృష్టిపెట్టాలి. నదీనదాల చెంత ఆక్రమణలు తొలగించేందుకు, కాలుష్యాన్ని నివారించేందుకు, ముఖ్యంగా వాటికి రక్షణ వ్యవస్థలను ఏర్పాటుచేసేందుకు చర్యలు చేపట్టాలి. ప్రజలు కూడా అందుకు పూర్తిస్థాయిలో సహకరించాలి. నీటివనరులు ఆక్రమణలకు గురికాకుండా, మురుగుమయంగా తయారవకుండా కంటికి రెప్పలా కాపాడుకోవాలి. పరిశుభ్రమైన మంచినీరు ప్రజలందరికీ అందేలా చూడాలి. ముఖ్యంగా.. అమృతతుల్యమైన ఆ జీవజలం.. మనిషిపాలిట గరళంగా మారకుండా పరిరక్షించుకోవాలి. ఇది అందరి బాధ్యత!..

# అవును... మీడియా గాడి తప్పుతోంది!

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

సమాజంలో ఫోర్త్ ఎస్టేట్‌గా పిలువబడే మీడియా ప్రజల పక్షాన నిలవాలి. రాజ్యాంగ విలువలని కాపాడడం, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం పత్రికలు, ఛానెళ్ళ యొక్క బాధ్యత. తన విధిని విస్మరించి చిత్తశుద్ధి లేని రాజకీయ పార్టీలు, ఆ పార్టీల నాయకుల వాణిగా నేటి మీడియా సంస్థలు ప్రతిధ్వనిస్తున్నాయి. ప్రజల సమస్యలని ప్రతిబింబింపచేసే వేదికలుగా, పరిశోధనాత్మక కథనాల వీచికలుగా పత్రికలు, చానెళ్ళు పనిచేయాలి. కానీ, ప్రస్తుత సమాజంలో అలా జరగడంలేదు. స్వార్థపూరిత రాజకీయ నాయకుల దుర్మార్గాలకి, స్వప్రయోజనాలకి ప్రతిరూపాలుగా మీడియా సంస్థలు దర్శనమిస్తున్నాయి. ప్రజల హక్కులని కాపాడడంలోనూ, సమాజంలో జరుగుతున్న దౌర్జన్యకాండలని నివారించడంలోనూ మీడియా ముఖ్య భూమిక పోషించాలి. కానీ, అలాంటి పోకడ కనిపించడంలేదు. ఎక్కడో ఒక్క శాతం మంది పాత్రికేయులు, మీడియా సంస్థల యజమానులు రాజకీయ నాయకుల ప్రలోభాలకి, ఒత్తిళ్ళకి తలొగ్గకుండా నిఖార్సైన జర్నలిజాన్ని కొనసాగిస్తున్నారు. మిగిలిన 99 శాతం మంది విలువలని విడిచిపెట్టి పక్కదారి పడుతున్నారు. మన 'లాయర్' ఆ ఒక్క శాతంలో కొనసాగాలని ఆకాంక్షిస్తున్నాను.

– యం. విజయలక్ష్మి
మాజీ న్యాయమూర్తి, హైదరాబాదు.

# లాయర్ వార్తలు, విశ్లేషణలు బాగుంటున్నాయి!

మన 'లాయర్'లో ప్రతి వారం వస్తున్న వార్తలు, విశ్లేషణలు ఆసక్తికరంగా ఉంటున్నాయి. గత వారం వచ్చిన కొన్ని వ్యాసాలని పరిశీలిస్తే... ముందుగా మీడియా విలువలపై ఇటు సమాజము అటు మీడియా యాజమాన్యాలూ రెండూ శ్రద్ధ వహించాలి. వార్తల ప్రచురణ, నియంత్రణ విధానాలపైన సమగ్ర దృక్పథం అలవరచుకోవాలి. ఇక చక్కెర ఎంత తీపో.. చక్కెర వ్యాధి అంత ప్రమాదకరమని చక్కగా చెప్పారు. రక్తమోడుతున్న రహదారులపై ఈసారి, పర్యావరణ పరిరక్షణపై మరోసారి ఇలా ప్రతి వారం మన 'లాయర్'లో వస్తున్న సంపాదకీయాలు కూడా ఆలోచనాత్మకంగా ఉంటున్నాయి. 'లాయర్' సంపాదకీయాల కోసం వారం వారం ఎదురు చూస్తుంటాము.

సీ. ఆర్. విశ్వేశ్వరరావు - మాజీ ఉపకులపతి, హైదరాబాదు.

# 'మహా' విజయం కమలదళంలో జోష్ పెంచింది!

మహారాష్ట్రలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో 'మహాయుతి' సాధించిన ఘనవిజయం కమలదళంలో జోష్ పెంచింది. ఐదు నెలలక్రితం జరిగిన పార్లమెంటు ఎన్నికలలో చతికలపడ్డ బీజేపీ, ఈ ఎన్నికల నాటికి పుంజుకున్న తీరు అందరిని ఆశ్చర్యపరచింది. మొత్తానికి మహారాష్ట్రలో బీజేపీ, దాని మిత్రపక్షాలు సాధించిన విజయం ఆ రాష్ట్ర చరిత్రలో చరిత్రాత్మకం. ఈ విజయంతో బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం రెట్టింపయ్యింది. ముఖ్యంగా మహారాష్ట్రలో ఉన్న హిందూ సమాజం ఈసారి ఓటింగులో ఎక్కువగా పాల్గొనేలా చేయడంలో అక్కడ స్థానిక హిందువులు చేసిన ప్రయత్నాలు కూడా బాగానే ఫలించాయి. జార్ఖండ్ ఫలితం బీజేపీని నిరుత్సాహపరచినా, ఊహించని 'మహా' విజయంతో సంతృప్తి చెందిన పార్టీ అగ్రనాయకత్వం జార్ఖండ్ అపజయాన్ని పెద్దగా పట్టించుకోలేదని అనిపిస్తోంది. ఆ అపజయం ముందు ఈ విజయం చిన్న గీత ముందు పెద్ద గీతగా ఆ పార్టీ వర్గాలు భావించినట్లున్నాయి!

– యం. చంద్రమౌళి, కొత్తఢిల్లీ.




# మరణమృదంగం మోగిస్తున్న.. ఢిల్లీ గాలి!

దేశ రాజధాని ఢిల్లీని గాలి కాలుష్యం వెంటాడుతోంది. భారత రాష్ట్రపతి, ప్రధానిలతో పాటు అత్యంత ప్రముఖులు నివసించే ఢిల్లీ నగరం కలుషిత గాలిని పీలుస్తూ నరకయాతన పడుతోంది. ఢిల్లీ వాసులని శ్వాసకోశ వ్యాధులు చుట్టుముడుతున్నాయి. జనం ఊపిరాడని దుస్థితితో అల్లాడిపోతున్నారు. క్షణమొక గండంగా ఢిల్లీ వాసులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకుతున్నారు. కాలుష్యభూతం మరణమృదంగం మోగిస్తూ విరుచుకుపడుతుండడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. వాయునాణ్యత సూచీ ప్రకారం 50 పాయింట్లలోపు ఉంటేనే వాతావరణం బాగున్నట్లు. అలాంటిది అది 400 పాయింట్లు దాటిపోతోందంటే పరిస్థితి ఎంత ప్రమాదకరంగా ఉందో ఊహించుకోవచ్చు. ఊపిరిపోసే గాలే విషపూరితమైతే ఎలా బతకాలి?.. ఇప్పటికే విద్యాసంస్థలు మూసేశారు. కరోనా లాక్‌డౌన్‌ని తలపించే రీతిలో తరగతులన్నీ మళ్ళీ ఆన్‌లైన్‌కి మారిపోయాయి.

## ఊపిరితిత్తులు నాశనం...!

ఢిల్లీలో నివసించే పౌరులందరికీ ఇప్పటికే ఎంతో కొంత ఊపిరితిత్తులు నాశనం అయ్యి ఉంటాయని పరిశోధకులు చెప్తున్నారు. అశోక యునివర్శిటీ డీన్, పరిశోధకుడు అనురాగ్ ఈమేరకు ఒక ప్రకటన కూడా విడుదల చేశారు. 'ఈ స్థాయి కాలుష్యం ప్రభావం ఆరోగ్యవంతుల ఊపిరితిత్తులు(లంగ్స్) పైన కూడా ఎంతో కొంత పడి ఉంటుంది, అవి ఇప్పటికే క్షీణించడం మొదలై ఉంటుంది" అని ఆయన అభిప్రాయపడ్డారు. ఇప్పటికే ఆయాసం, ఇన్‌ఫెక్షన్లు ఉన్న వారి పరిస్థితి అయితే వర్ణనాతీతమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "ఈ కాలుష్యం ఎవరినీ వదిలి పెట్టదు" అంటూ ఆయన హెచ్చరించారు.

## నేతల నిర్లక్ష్యం వల్లనే ఢిల్లీకి ఈ దుర్గతి పట్టింది!

ఇదో పెనువిపత్తుగా మారి ప్రజల ప్రాణాలు తీస్తుందని గ్రహించిన సుప్రీంకోర్టు, ఎంతో ముందుచూపుతో మూడేళ్ళ క్రితమే హెచ్చరిస్తూ కొరడా ఝుళిపించినా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల్లో పెద్దగా చలనం రాలేదు.

ఏవో కంటితుడుపు విధానాలు తప్ప, శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోలేదు. బీజేపీ 'ఆప్'నీ, 'ఆప్'ని బీజేపీ తిట్టుకుంటూ కుళ్ళు రాజకీయాలతో కాలం గడిపేస్తున్నాయి. అంతే తప్ప ప్రపంచంలోనే అత్యంత కాలుష్యనగరాల్లో ఢిల్లీ ఒకటిగా భారత రాజధాని అవతరించడం ఎంత అవమానకరమో గుర్తించడం లేదు.

## ఈ కాలుష్యం రాత్రికి రాత్రే వచ్చింది కాదు!

అసలే దుమ్ము-ధూళితో చస్తుంటే, వాటికి తోడుగా కాలుష్యం వెదజల్లే కర్మాగారాలు, బొగ్గుతో పనిచేసే విద్యుత్‌ప్లాంట్లు ఢిల్లీని చుట్టుముట్టివున్నాయి. వీటితోపాటు కోట్లాదిగా పెరిగిపోతున్న వాహనాలు వాతావరణాన్ని పొగబారుస్తున్నాయి. అంగుళం కూడా ఖాళీ లేకుండా ఆకాశహర్మ్యాలను నిర్మిస్తున్నారు. నగరం మొత్తాన్ని కాంక్రీట్ జంగిల్‌గా మార్చేశారు. ఇవి చాలవన్నట్లుగా చుట్టుపక్కలున్న రాష్ట్రాల్లో పంటల వ్యర్థాలను తగులబెట్టడం ద్వారా వచ్చే కాలుష్యం వీటికి తోడయ్యింది. అంతా కలసి వెరసి, ఢిల్లీ వాతావరణానికి ముప్పుగా ఏర్పడి, ఆ ఫలితం ఇప్పడు దేశ రాజధాని అనుభవిస్తోంది. మన దేశంలో ఇప్పుడు ఢిల్లీలోనే కాదు, ముంబై, కోల్‌కతా, బెంగుళూరు, చెన్నై, అహమ్మదాబద్, హైదరాబాద్ తదితర నగరాల్లోనూ వాయుకాలుష్యం విజృంభిస్తోంది.

## హడలిపోతున్న హైదరాబాదు!

ఇటీవల హైదారాబాద్‌లో సైతం ఒక్కసారిగా ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ పడిపోయిందన్న వార్తలు విస్తృతంగా వచ్చాయి. కూకట్‌పల్లి, మూసాపేట్, బాలానగర్, నాంపల్లి, మెహదీపట్నంలో ప్రమాదకర స్థాయిలో గాలి కాలుష్యం ఏర్పడిందని పర్యావరణ నిపుణులు పేర్కొన్నారు. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 300 దాటిపోయిందని అంచనా వేశారు. ఢిల్లీకి సరిసమానంగా గాలి కాలుష్యం నమోదవుతుందన్న ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ సమస్యపై కనీసం దృష్టిపెట్టడం లేదని హైదరాబాదు ప్రజలు ఆరోపిస్తున్నారు. వెంటనే చర్యలు చేపట్టాలని సిటీ వాసులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## కాలుష్య నివారణకు ఏం చేయాలి?

గత శతాబ్దంలో, 1952లో లండన్‌లో ఇలాగే గాలి కాలుష్యంతో 4వేల మంది మరణించారు. ఓ పదేళ్ళ కిందట చైనా రాజధాని బీజింగ్‌లోనూ ఈ కాలుష్యం ఆవరించింది. వాళ్ళు వెంటనే చర్యలు తీసుకోవడంతో ఆ నగరాలు హాయిగా ఊపిరి పీల్చుకుంటున్నాయి. ఇకనైనా, మన నేతలు కళ్ళు తెరవాలి. పరిస్థితి చేయిదాటిపోకుండా వేగవంతమైన చర్యలు తీసుకోవాలి. పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు కలసి యుద్ధప్రాతిపదికన పనిచేయాలి. ఢిల్లీలోనూ, పరిసర రాష్ట్రాల్లో కూడా వెంటనే కాలుష్యం వెలువరించే పరిశ్రమలను మూసేయాలి. కోట్లాదిగా తిరుగుతున్న వాహనాలను క్రమబద్ధీకరించాలి. బొగ్గు ఆధారంతో నిర్మించిన విద్యుత్ ప్రాజెక్టుల స్థానంలో గ్యాస్‌ప్లాంట్లను ఏర్పాటుచేయాలి. ఇరుగుపొరుగు రాష్ట్రాల్లో పంటపొలాల్లో వ్యర్థాలను తగలబెట్టడం పూర్తిస్థాయిలో నిషేధించి వారికి ప్రత్యామ్నాయం సూచించాలి.

నగరంలో అదుపు లేకుండా సాగుతున్న భవన నిర్మాణాలను నియంత్రించాలి. వ్యర్థాలను రోడ్లమీద, నదుల్లో పారేయకుండా చర్యలు చేపట్టాలి. ఎక్కడా మురుగు పేరుకోకుండా కఠిన నిబంధనలు అమలుచేస్తూ అధికారగణాన్ని రంగంలోకి దించాలి. పరిశుభ్రమైన వాతావరణంలో మంచి గాలి వీచేలా ప్రజల భాగస్వామ్యంతో మొక్కలను పెంచాలి. ఇప్పటినుంచే ముందుజాగ్రత్తగా అన్ని రాష్ట్రాల్లో కాలుష్యనివారణకు, పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించాలి. దేశవ్యాప్తంగా ప్రతి గ్రామంలోనూ కార్యాచరణ చేపట్టాలి. అందుకు ప్రత్యేకశాఖను-అధికార యంత్రాంగాన్ని కూడా ఏర్పరచాలి. అవసరమైతే కొత్త చట్టాలను చేయాలి. ఈ గాలిభూతం.. మరో కరోనా మహమ్మారిగా మారి.. ప్రజల ప్రాణాలు తీయకముందే ప్రభుత్వాలు, స్వచ్ఛంధసంస్థలు, అధికారయంత్రాంగం, ప్రజలు అంతా కలసి ఆ రాకాసిని తరిమికొట్టేందుకు ఉద్యమించాలి. లేకుంటే, ఒక్క ఢిల్లీకే కాదు.. దేశమంతటికీ ఇది పెను ప్రమాదంగా దాపురిస్తుందనడానికి ఎలాంటి సందేహం అవసరం లేదు...! తస్మాత్ జాగ్రత్త..!!

- రాజశ్రీ

# సమస్యలతో హోరెత్తిన జడ్పీ సమావేశం

## • పార్టీలకతీతంగా కలసికట్టుగా పనిచేద్దామన్న మంత్రి ఆనం

***ఇటీవల జరిగిన నెల్లూరు జిల్లా పరిషత్ సమావేశంలో పలువురు ఎమ్మెల్యేలు, జడ్పీటీసీలు తమ ప్రాంతాల్లోని సమస్యలు ఏకరువు పెట్టడంతో సమావేశం హోరెత్తింది. జలజీవన్ పనులు సరిగా చేపట్టడం లేదని, మధ్యలోనే నిలిపేశారంటూ కొండాపురం, వాకాడు, కావలి, చిట్టమూరు, అల్లూరు జడ్పీటీసీ సభ్యులు గగ్గోలు పెట్టారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షత్వంలో, రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు తమ సమస్యలను విన్నవించుకున్నారు.***



పార్టీలకు అతీతంగా జిల్లాను ప్రగతిపథంలో పయనింపజేసేందుకు అందరం కలసికట్టుగా కృషి చేద్దామని ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి చెప్పారు. విద్యుత్ ఉత్పత్తిలో కాలానుగుణంగా వస్తున్న మార్పుల్లో భాగంగా, ఎటువంటి పర్యావరణ హాని కలగని సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలనేది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని, ప్రతి గ్రామం ఆ సౌర విద్యుత్ పథకాన్ని అందిపుచ్చుకుని స్వయం సమృద్ధిని సాధించే దిశగా అడుగులు వేయాలన్నారు స్థానిక ప్రజాప్రతినిధులు ఆ విషయమై చర్యలు చేపడితే, పంచాయతీలు కరెంట్ బిల్లులకు చెల్లించే మొత్తాన్ని ఇతర ప్రజావసరాలకు వాడుకోవచ్చునన్నారు. ప్రభుత్వం అందించే సబ్సిడీలను ఉపయోగించుకుని ప్రతి ఇంటిలో సౌరవిద్యుత్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుంటే ఎంతో ఉపయోగకరమన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు వర్క్‌షాప్‌లను ఏర్పాటు చేయాలని, నూతనంగా నిర్మించే ప్రతి ఇంటిలో సౌర విద్యుత్ ప్యానెల్ ఏర్పాటును భాగం చేసేలా ప్రజలకు అవగాహన కలిగించాలని ఆయన సూచించారు.

### ప్రోటోకాల్ పాటించకపోతే ఎలా?

**- జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఆగ్రహం**

జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ, పల్లెపండుగ కార్యక్రమాలకు జడ్పీటీసీ సభ్యులను ఆహ్వానించకపోవడం ఏమిటని, స్వయంగా తనకే ఆ పరిస్థితి ఎదురైందని అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. పలు మండలాల్లో ప్రోటోకాల్ వివాదాలకు కొందరు అధికారులే కారణమవుతున్నారని విమర్శించారు. అనంతరం, పలువురు ఎమ్మెల్యేలు ఈ సమావేశంలో తమ నియోజకవర్గాల్లో నెలకొని ఉన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.

### కొమ్మరపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేయాలి

**- రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి**

నెల్లూరు రూరల్, కొమ్మరపూడి గ్రామంలో మంజూరైన ఎత్తిపోతల పథకాలను కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేయకుండా అసంపూర్తిగా నిలిపారని, ఆ కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టి కొత్త కాంట్రాక్టర్ల ద్వారా పనులు చేపట్టాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కోరారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇరిగేషన్ డెవలప్ కార్పొరేషన్ సంస్థ అధికారులు సమావేశాలకు రాకుండా నిర్లక్ష్యంగా ఉన్నారని, వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

### తాగునీటి సమస్యను పరిష్కరించండి

**- ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్**

జిల్లాలోని మెట్టప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో మంచినీటి సమస్యను నివారించాలని, శాశ్వత ప్రాతిపదికన అందుకు పనులు చేపట్టాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ విన్నవించారు. సోమశిల నీరు వస్తే గాని ఈ సమస్య పరిష్కారం కాదని చెప్పు, ఈలోగా జలజీవన్ మిషన్ క్రింద ప్రతి ఇంటికి త్రాగునీరు అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. అదేవిధంగా నక్కలగండి వాగుకు మరమ్మత్తులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో డాక్టర్ల కొరత లేకుండా భర్తీ చేయాలని, కొండాపూరం మండలంలో నాలుగు గ్రామాల్లో రెండవ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మంజూరు చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

### రైతుల బాధలు తీర్చండి

**- వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల**

వెంకటగిరి నియోజకవర్గంలో రైతులు ఎత్తిపోతల పథకాల మీద ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారని, వ్యవసాయంలో ఉంటూ ఎన్నో సమస్యలతో వారు సతమతమవుతున్నారని, వారి బాధలు తీర్చాలని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఇలాంటి ప్రాముఖ్యత ఉన్న సమావేశానికి సంబంధిత నీటిపారుదల అధికారులు హాజరుకాకపోవడం, లిఫ్ట్ ఇరిగేషన్ అధికారుల తీరు బాగాలేదని ఆయన విమర్శించారు.

### జలజీవన్ మిషన్ పనులను వేగవంతం చేయాలి

**- జడ్పీటీసీ సభ్యులు**

జిల్లాలో జలజీవన్ మిషన్ పనులను వేగవంతం చేయాలని ఈ సమావేశంలో పాల్గొన్న జడ్పీటీసీ సభ్యులు సుధాకర్‌రెడ్డి తదితరులు కోరారు. అదే విధంగా, వైద్యారోగ్య శాఖలో డెప్యుటేషను రద్దు చేయాలని, అసంపూర్తిగా ఉన్న స్కూల్ భవనాలను పూర్తిచేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న హెడ్మాస్టర్లపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆనంద్, శాసన మండలి సభ్యులు బల్లి కళ్యాణ్ చక్రవర్తి, మేరిగ మురళీధర్, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

---

## 'ఉత్తమ ఎన్‌సిసి అధికారి'గా.. నరేంద్రబాబు



నెల్లూరులోని కెవిఆర్ నగర పాలక ఉన్నత పాఠశాలలో 10-ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సిసి సెకండ్ ఆఫీసర్‌గా ఉన్న గుండాల నరేంద్ర బాబుకు 'ఉత్తమ ఎన్‌సిసి అధికారి'గా అవార్డు లభించింది. ఈనెల 24న ఎన్‌సిసి దినోత్సవం సందర్భంగా ఆయన హైదరాబాద్‌లోని ఏపీ-తెలంగాణ ఎన్‌సిసి డెప్యూటీ డైరెక్టర్ జనరల్ వి.మధుసూదన్‌రెడ్డి నుంచి ఆయన ఆ అవార్డును అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల పరిధిలో ఉత్తమసేవలందిస్తున్న ఎన్‌సిసి అధికారులకు ఇచ్చే ఈ ప్రతిష్టాత్మక అవార్డు నెల్లూరుకు చెందిన నరేంద్రబాబుకు లభించడం విశేషం. ఆటు ఉపాధ్యాయునిగానే కాక, ఎన్‌సిసి అధికారిగా విద్యార్థులకు, ఎన్‌సిసి కేడెట్లకు ఉత్తమ శిక్షణ ఇస్తూ, వారిలో క్రమశిక్షణ, దేశభక్తి, సామాజిక సేవ, సహకారగుణం, నాయకత్వ లక్షణాలు, పోరాటపటిమ, పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛభారత్ వంటి పలు సామాజిక చైతన్య కార్యక్రమాల నిర్వహణలో ఆయన చూపుతున్న చొరవ మార్గదర్శకం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పిలుపుమేరకు నిర్వహించే ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలను ఆయన జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తుండడం, ప్రకృతి విపత్తుల సమయంలో బాధితులను ఆదుకోవడం వంటివి అందరి అభినందనలు అందుకున్నాయి. గత పన్నెండేళ్లుగా జిల్లాలో ఎన్నో అత్యుత్తమ సేవలు అందిస్తున్న నరేంద్రబాబు గత ఎన్‌సిసి కమాండింగ్ ఆఫీసర్లు కెప్టెన్ జి.ఎస్.యుగంధర్ రెడ్డి, లెఫ్టినెంట్ కమాండర్ వినయ్ రామచంద్రన్, ప్రస్తుత కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ గణేష్ గొదంగవే, ప్రస్తుత గుంటూరు గ్రూప్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎస్.ఎం చంద్రశేఖర్ తదితరుల నుంచి కూడా ఎన్నో అవార్డులు రివార్డులు పొందారు. గుంటూరు గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్.ఎం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో, గుంటూరు గ్రూప్ నుంచి ఎంపికై, ఆయన ఉత్తమ ఎన్‌సిసి అధికారిగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా 10- ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సిసి నెల్లూరు లెఫ్టినెంట్ కమాండర్, కమాండింగ్ ఆఫీసర్ గణేష్ గొదంగవే, ఎన్‌సిసి కార్యాలయం సిబ్బంది, కెవిఆర్ పాఠశాల హెడ్మాస్టర్ ఎం.విజయప్రకాష్‌రావు, ఉపాధ్యాయులు ఆయన్ను అభినందించారు.

## నెల్లూరులోనే ఇఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటుచేయండి

### డైరెక్టర్ జనరల్ అశోక్ కుమార్‌సింగ్‌కు ఎంపీ వేమిరెడ్డి విజ్ఞప్తి



నెల్లూరు పార్లమెంటరీ నియోజకవర్గంలో 100 పడకల ఇఎస్ఐ ఆసుపత్రి నిర్మాణానికి సహకరించాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇఎస్ఐసి డైరెక్టర్ జనరల్ అశోక్‌కుమార్ సింగ్‌కు విజ్ఞప్తిచేశారు. ఈనెల25న ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి, ఆమేరకు మార్పు చేయాలని కోరారు. ఇఎస్ఐ ఆసుపత్రి కోసం నెల్లూరు హెడ్‌క్వార్టర్స్ పరిధిలో 2.18 ఎకరాల స్థలం అందుబాటులో ఉందన్నారు. నెల్లూరుకు కేటాయించిన 100 పడకల ఇఎస్ఐ ఆసుపత్రిని విజయవాడలోని ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ అథారిటీవారు, స్థలాభావం అన్న కారణంతో తిరుపతి పార్లమెంటరీ నియోజకవర్గంలోని వెంకటాచలం మండలం కనుపూరు బిట్-1 గ్రామంలో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, నెల్లూరులో భూమి అందుబాటులో ఉందికనుక ఆ ఆసుపత్రిని నెల్లూరులోనే ఏర్పాటు చేయాలని ఆయన విన్నవించారు. ఈ సందర్భంగా తక్కువ స్థలంలోనే ఇఎస్ఐ ఆసుపత్రులను కట్టిన విషయాలను ఎంపీ వేమిరెడ్డి డైరెక్టర్ జనరల్ దృష్టికి తీసుకువచ్చారు. తిరునల్వేలిలో 2.20 ఎకరాల్లో, యానాంలో ఒక ఎకరం విస్తీర్ణంలోనే నిర్మించారని వివరించారు. తిరుపతి పరిధిలోని శ్రీసిటీలో ఇఎస్ఐ ఆసుపత్రి ఇప్పటికే మంజూరైందని, కృష్ణపట్నం పోర్టులో మరో ఇఎస్ఐ ఆసుపత్రిని ప్రతిపాదించారని, ఈ నేపథ్యంలో నెల్లూరు పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని నెల్లూరులో ఇఎస్ఐ ఆసుపత్రి నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో, భూ విస్తీర్ణం నిబంధనను సడలించాలన్న తన అభ్యర్థనను పరిశీలించి, నెల్లూరులో 2.18సెంట్ల స్థలంలో 100పడకల ఇఎస్ఐ ఆసుపత్రి నిర్మాణానికి తగిన సూచనలు జారీ చేయాలని ఆయన కోరారు.

### పాటూరులో చేనేత క్లస్టర్‌కు నిధులివ్వండి

నెల్లూరు పార్లమెంట్ పరిధిలోని కోవూరు నియోజకవర్గంలో ఉన్న పాటూరులో స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(ఎస్‌సిడిపి)లో భాగంగా ప్రత్యేక క్లస్టర్ ఏర్పాటు చేయాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈనెల 26న కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్‌కు విన్నవించారు. పాటూరులో గ్రామంలో 500 చేనేత కుటుంబాలు పూర్తిగా చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయని, అక్కడ ప్రత్యేక క్లస్టర్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై కేంద్రమంత్రి పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

## అయ్యప్ప గుడిలో విశేష పూజలు

నెల్లూరు, వేదాయపాళెంలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో మండల పూజోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం విశేష పూజలు జరిగాయి. సంప్రదాయబద్ధంగా స్వామివారికి అలంకరణలు చేసి, ఉదయం పాలాభిషేకం, మహాగణపతి హోమం, ఉషఃపూజ, నవకాభిషేకం, శ్రీవేలీ ఉత్సవం తదితర పూజలు చేశారు. సాయంత్రం మహాదీపారాధన, భగవతిసేవ, అత్తాళ పూజ, శ్రీవేలీ ఉత్సవం, పడి కర్పూరం, హరివరాసనం కార్యక్రమాలను కేరళ తంత్రులచే ఘనంగా నిర్వహింపజేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధ్యక్షులు గూడల శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గద్దం రత్నయ్య, కత్తి మోహన్‌రావు తదితరులు పర్యవేక్షించారు.



## బాధ్యతలు చేపట్టిన..
## ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్

నెల్లూరు ఏఆర్ డీఎస్పీగా ఎస్ చంద్రమోహన్ ఈనెల 25న నెల్లూరులోని కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం, జిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. విడవలూరుకు చెందిన చంద్రమోహన్, 1992లో ఆర్ఎస్ఐగా పోలీసు శాఖలో చేరారు. 2008లో ఆర్ఐగా ప్రమోషన్ పొంది, విశాఖ రూరల్, ఒంగోలు, నెల్లూరు, విజయవాడల్లో కూడా పనిచేసి సమర్థవంతమైన అధికారిగా పేరు తెచ్చుకున్నారు. ఇక్కడ ఏఆర్ డీఎస్పీగా పనిచేస్తున్న పి.వెంకటేశ్వరరావును జెన్కోకు బదిలీ చేసి, ఇటీవల బదిలీల్లో భాగంగా చంద్రమోహన్‌ను నెల్లూరు ఏఆర్ డీఎస్పీగా నియమించారు.

# బలవంతపు పన్ను వసూళ్ళు వద్దు

## కార్పొరేషన్ అధికారులతో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 26 డివిజన్లలో ఇళ్ళ పన్ను వసూళ్ళలో ప్రజలను బలవంతం చేయవద్దని, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కార్పొరేషన్ అధికారులకు చెప్పారు. తమ నియోజక వర్గంలోని 26 డివిజన్లకు సంబంధించి అభివృద్ధి పనులు, ప్రజల సమస్యలపై ఆయన ఇటీవల కార్పొరేషన్ కార్యాలయంలో నగర కమిషనర్ సూర్యతేజతో సహా అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంటిపన్నులు వసూలు చేయాల్సిందే, అయితే ప్రజలను భయభ్రాంతులను చేయకూడదన్నారు. కరెంట్ కట్ చేస్తామని బెదిరిస్తే సహించేది లేదన్నారు. పన్ను వసూళ్లకు ప్రజలకు కొంత సమయం ఇవ్వాలన్నారు. అలా కాదని మున్సిపల్ అధికారులు సొంత నిర్ణయాలు తీసుకోవద్దని, మున్సిపల్ చట్టం ప్రకారం అధికారులు వ్యవహరించాలని చెప్పారు. తాను ఎప్పుడూ కోటీశ్వరుల వైపు మాట్లాడనని, పేద, నిరుపేద, సామాన్య మధ్య తరగతి ప్రజల తరపున మాట్లాడతానని ఆయన స్పష్టం చేశారు. పేదల వైపే తానుంటానన్నారు. ప్రజలకు జనన, మరణ ధ్రువీకరణ పత్రాల మంజూరు విషయంలో ఆలస్యం చేయవద్దన్నారు. రూరల్ నియోజకవర్గంలో రోడ్లపై 1700 గుంతలు ఉన్నాయని, ఇప్పటివరకు 65 గుంటలు పూడ్చారని, ఇంకా 1600కు పైగానే గుంటలు ఉన్నాయని, అవి కూడా పూడ్చి రోడ్ల మరమ్మత్తులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

# 'నవ్వుల మాంత్రికుడు రమణారెడ్డి' పుస్తకావిష్కరణ



సీనియర్ జర్నలిస్టు ఉదయగిరి ఫయాజ్ రచించిన 'నవ్వుల మాంత్రికుడు రమణారెడ్డి' పుస్తకాన్ని ఇటీవల ప్రముఖ హాస్యనటుడు, పద్మశ్రీ డా. బ్రహ్మానందం నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బ్రహ్మానందం మాట్లాడుతూ, నెల్లూరు యాసతో, పాత్రోచితమైన సంభాషణలతో, తాను నటించిన అన్ని సినిమాల్లోనూ రమణారెడ్డి తన ప్రత్యేకతను చాటుకున్నారని కొనియాడారు. ఆయా పాత్రల్లో ఆయన నటించారని అనడం కంటే జీవించారనడమే సరైనదన్నారు. అది హాస్య సన్నివేశమైనా, సీరియస్ పాత్రనైనా ఆయన ఆ పాత్రలో జీవించగలరని, సాంఘికాల్లోనూ, జానపదాల్లోనూ, పౌరాణికాల్లోనూ నెల్లూరు యాసకు నిదర్శనంగా నిలిచిన మహనీయులు రమణారెడ్డి అని రచయిత ఫయాజ్ అన్నారు. నెల్లూరు యాసకు ప్రాణప్రతిష్ఠ చేసిన రమణారెడ్డి జీవితచరిత్రను రాయడం తనకో మహదవకాశమని సంతోషం వ్యక్తం చేశారు. మూవీ వాల్యూం అధినేత, పబ్లిషర్ జిలానీబాషా, రమణారెడ్డి పెద్దబ్బాయి ప్రభాకర్‌రెడ్డి ఈ పుస్తక రచనకు సహకరించారంటూ వారికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. సీనియర్ జర్నలిస్ట్, రచయిత వినాయకరావు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు కబుర్లు

# భారత రాజ్యాంగం అపూర్వం

## జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రూపొందించిన భారత రాజ్యాంగం అపూర్వమైనదని, ఇది ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ కొనియాడారు. 75వ భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈనెల 26న నెల్లూరులోని జడ్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని, డాక్టర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జడ్పీ అధికారులతో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. జడ్పీ సీఈఓ విద్యారమ, డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# మహారాష్ట్ర ఫలితాలు..కాంగ్రెస్‌కి గుణపాఠం

## సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి



మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ అఖండవిజయం సాధించడంతో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పినట్లయిందని, ప్రధాని నరేంద్రమోడీ ఆధ్వర్యంలో బీజేపీ ప్రపంచంలోనే బలమైన పార్టీగా ఎదిగిందని బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ ఉపాధ్యక్షులు, ఆర్టీసీ జోనల్ ఛైర్మెన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి చెప్పారు. ఈనెల 26న నెల్లూరులోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా బీజేపీ సభ్యత్వ నమోదు 11కోట్లా 20లక్షలకు చేరిందని ఆయన తెలిపారు. ప్రజలు బీజేపీని విశ్వసిస్తున్నారని, బీజేపీ వస్తే రిజర్వేషన్లు ఎత్తివేస్తుందనే కాంగ్రెస్ నేతల అబద్ధపు ప్రచారాలను ప్రజలు నమ్మరన్నారు. త్వరలోనే తమ పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియను కూడా చేపట్టనున్నామని తెలిపారు. అందుకు కోస్తా ప్రాంతంలోని ఆరు జిల్లాలకు తనను ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కూడా పార్టీ నియమించడం పట్ల నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రాజేశ్వరి, నాయకులు వంశీధర్‌రెడ్డి, మిడతల రమేష్, ప్రవీణ్‌కుమార్, విజయకుమార్, గిరికుమార్‌గౌడ్, బైరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఇరుకళల అమ్మవారికి.. రామానందభారతీస్వామి పూజలు

నెల్లూరు చెరువుబడ్డున వెలసివున్న గ్రామశక్తి..శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవాలయాన్ని ఈనెల 26న సౌభాగ్య భువనేశ్వరి పీఠాధిపతి పూజ్యశ్రీ రామానందభారతీస్వామి వారు దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ఇఓ గిరికృష్ణ, అర్చకులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. సాయిసదన్ ఛైర్మెన్ శ్రీనివాసులురెడ్డి, ప్రధాన అర్చకులు చంద్రస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఫలించిన ఎంపీ వేమిరెడ్డి కృషి

- మెడికల్ కాలేజీకి..మరో 9 పీజీ సీట్ల కేటాయింపు
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు..తల్లిదండ్రులు

నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కృషి ఎట్టకేలకు ఫలించింది. జిల్లాకు ఎంతో ప్రతిష్ఠాత్మకమైన నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో పీజీ సీట్ల కేటాయింపు కోసం ఆయన చేస్తున్న ప్రయత్నాలు ఫలించాయి. ఆ కాలేజీలో పోస్టు గ్రాడ్యుయేషన్‌కు సంబంధించి జనరల్ సర్జరీలో 5 కొత్త సీట్లు, ఆర్థోపెడిక్ విభాగంలో 4 సీట్లు కేటాయిస్తూ కేంద్ర వైద్యారోగ్య శాఖ తాజాగా ఆదేశాలు జారీ చేయడం విద్యార్థులకు, వారి తల్లితండ్రులకు సంతోషం కలిగిస్తోంది. ఆమేరకు నెల్లూరు మెడికల్ కళాశాలకు సమాచారం అందింది కూడా. నెల్లూరు మెడికల్ కళాశాలలో 2024–25 సంవత్సరానికి సంబంధించి కాలేజీలో ఆర్థోపెడిక్, జనరల్ సర్జరీకి సంబంధించి పీజీ సీట్లు కేటాయించాలని కోరుతూ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గత ఆగస్టు 29వ తేదీన నేషనల్ మెడికల్ కమిషన్ ఛైర్మన్ బి.ఎన్ గంగాధర్‌ని ఢిల్లీలో కలిసిన విషయం తెలిసిందే. అదేవిధంగా కేంద్రమంత్రిని కూడా ఆయన కలిసి పీజీ సీట్ల కేటాయింపుపై చర్చించారు. ఈ నేపథ్యంలో ఎన్ఎంసీ సభ్యులు ఆసుపత్రిని, కళాశాలను పరిశీలించి ఆమేరకు సీట్ల కేటాయింపు చేపట్టడంతో, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డా. నాగరాజమన్నార్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.సిద్ధా నాయక్, డిప్యూటీ సూపరింటెండెంట్‌లు డా.మస్తాన్ బాషా, డా.నరేంద్ర విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీట్లు సాధించ డంలో ప్రత్యేక శ్రద్ధతో కృషిచేసిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి వారు ధన్యవాదాలు తెలియజేశారు.

# జాతీయ యోగా పోటీల్లో నెల్లూరీయుల ప్రతిభ




తమిళనాడు స్పోర్ట్స్ యూనివర్శిటీలో ఈనెల 24న జరిగిన జాతీయ యోగా పోటీల్లో నెల్లూరీయులు తమ ప్రతిభను నిరూపించుకున్నారు. తమిళనాడు యోగా కమిటీ ఆధ్వర్యంలో వయసుల వారీ నిర్వహించిన పలు విభాగాల పోటీల్లో నెల్లూరుకు చెందిన కీర్తి (12–14 ఏళ్ళ వయస్సు లోపు) తృతీయస్థానం సాధించగా, 36–45ఏళ్ల వయస్సు లోపు విభాగంలో జి.రేవతి ద్వితీయ స్థానం, కామన్ కేటగిరీ (46–55 ఏళ్ళ లోపు)లో ఎం.వి ప్రసన్నకుమార్, 56 ఏళ్ళ పైబడిన వయస్సు వారి విభాగంలో బి.రఘురామయ్య ద్వితీయ స్థానం సాధించినట్లు యోగా మాస్టర్ ప్రసన్నకుమార్ తెలిపారు. విజేతలను నెల్లూరులోని యోగా మాస్టర్లు అభినందించారు.

# రాజ్యాంగం గురించి విద్యార్థులు తెలుసుకోవాలి



భారత రాజ్యాంగం ప్రపంచంలోనే ఎంతో గొప్పదైన రాజ్యాంగమని, దాని గురించి చిన్నతనం నుంచే విద్యార్థులు తెలుసుకోవాలని జిల్లా సమగ్ర శిక్షా అకడమిక్ మానిటరింగ్ అధికారి జి. సుధీర్‌బాబు చెప్పారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా, నెల్లూరులోని కొండాయపాళెం నగర పాలక ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఎం.భాస్కర్‌రావు ఆధ్వర్యంలోజరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మనదేశ రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగమని, 1949 నవంబర్ 26న రాజ్యాంగం ఆమోదించబడినదని తెలిపారు. అనంతరం విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. తొలుత, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.






# ఆయుర్వేదంపై అవగాహన ర్యాలీ



ఆయుర్వేద వైద్యం అనేక రోగాలను నయం చేస్తుందని, సాధారణమైన వ్యాధులకే కాకుండా దీర్ఘకాలిక జబ్బులకు కూడా ఆయుర్వేదం దివ్యౌషధమని ఆయుష్ జిల్లా వైద్యాధికారి ఎం.గోవిందయ్య చెప్పారు. 'దేశ్‌కీ ప్రకృతి పరీక్షన్ అభియాన్'లో భాగంగా ఈనెల 26న నెల్లూరు మూలాపేటలోని బాలికోన్నత పాఠశాల నుంచి విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ప్రజలకు ఆయుర్వేదం పట్ల అవగాహన కలిగించారు. ప్రజల ఆరోగ్యానికి ఎంతో ఉపకరించే ఆయుర్వేద వైద్యాన్ని విస్తరిస్తూ కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుధారాణి, డాక్టర్ సరళకుమారి, ఫార్మాసిస్ట్ గౌరీశంకర్ పాల్గొన్నారు.

# 'అమ్మ భాష'లోనే అందరూ మాట్లాడుకోవాలి

## • ప్రపంచ తెలుగు సాహితీ సదస్సులో వెంకయ్య పిలుపు



ప్రతిఒక్కరూ మాతృభాష పరిరక్షణకు నడుంబిగించాలని, 'అమ్మ భాష'లోనే ఒకరి కొకరు మాట్లాడుకోవాలని, మన ఇంటి నుంచే అదొక ఉద్యమంగా ప్రారంభం కావాలని భారత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పిలుపు నిచ్చారు. ఖతార్ రాజధాని దోహా నగ రంలో ఈ నెల 22న వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, ఆంధ్ర కళావేదిక-ఖతార్ ఆధ్వర్యంలో జరిగిన 9వ ప్రపంచ తెలుగు సాహతీ సదస్సులో మన వెంకయ్య పాల్గొని, మాతృభాష ప్రాధాన్యతను గురించి తనదైన శైలిలో మాట్లాడి అందరినీ ఆకట్టుకున్నారు. 'మాతృమూర్తి-మాతృభూమి-మాతృభాష'లే మన అస్తిత్వమనే విషయాన్ని ఎవరూ విస్మరించకూడదన్నారు. తల్లితండ్రులు మాతృభాషలోని సాహిత్యాన్ని-సంస్కృతిని పిల్లలకు పరిచయం చేయాలన్నారు. సృజ నాత్మకత, మానవీయ విలువలు, సామాజిక చైతన్యానికి పెద్దపీట వేసే రచనలు రావా లని ఆకాంక్షించారు. తెలుగు సాహితీ చరిత్రను అధ్యయనం చేస్తే, తెలుగువారి చరిత్రను తెలుసుకోగలుగుతామని, ఓటీటీ ద్వారా తెలుగు సాహిత్యాన్ని ఈ తరం వారికి తెలియజేసేందుకు సాహితీవేత్తలు, కళాకారులు కృషిచేయాలని సూచించారు. ప్రపంచం నలుమూలల నుంచి ఈ సద స్సుకు వచ్చిన తెలుగు భాషాభిమానులకి, సాహితీవేత్తలు-కవులు-రచయితలకి, వివిధ రంగాల ప్రముఖులకి ఆయన శుభాకాంక్షలు చెప్పారు. తెలుగు గడ్డకు దూరంగా నివసిస్తున్నప్పటికీ, భాషాభిమా నంతో అంతర్జాతీయస్థాయిలో తెలుగు భాషా పరిమళాలను వెదజల్లేలా ఇంత మంచి కార్యక్రమాన్ని నిర్వహించిన వంగూరి ఫౌండేషన్ అధ్యక్షులు వంగూరి చిట్టెన్‌రాజుని, ఆంధ్ర కళావేదిక అధ్యక్షులు భాగవతుల వెంకప్ప.. తదితరులందరినీ వెంకయ్య అభినందించారు.

# చంద్రశేఖరపురం వద్ద ..రోడ్డు ప్రమాదాలు నివారించండి

## కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి వేమిరెడ్డి వినతి



నెల్లూరు జిల్లా కొడవలూరు మండలంలోని చంద్రశేఖరపురం కూడలి వద్ద జాతీయ రహదారి-16పై వెహికల్ అండర్ పాస్ (వీయుపి) ఏర్పాటు చేసి, రోడ్డుప్రమాదాలను నివారించాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. ఆమేరకు బుధవారం ఆయన కేంద్రమంత్రిని కలిసి వినతిపత్రం అందించారు. ఆ జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై ఎలాంటి అండర్ పాస్ లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఎంపీ వేమిరెడ్డి.. కేంద్రమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. సమీప గ్రామాలైన సంజీవనగర్, పెయ్యలపాళెం, ఊచగుంట పాళెం, చౌటపాళెం, తడకలూరు, దగదర్తి తదితర గ్రామాల ప్రజలు పలువురు ఈ ప్రమాదాల్లో మరణించగా, మరికొందరు తీవ్ర గాయాలపాలయ్యారని కూడా వివరించారు. ఈ నేపథ్యంలో చంద్రశేఖరపురం వద్ద వెహికల్ అండర్ పాస్ ఏర్పాటుచేసి ప్రజల అవస్థలు నివారించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# స్ఫూర్తిదాయకం..శ్రీసిటీ

## 'జాగృతి యాత్ర' బృందం ప్రశంస





పారిశ్రామిక రంగంలో శ్రీసిటీ సేవలు స్ఫూర్తిదాయకమని ఇటీవల శ్రీసిటీని సందర్శించిన జాగృతి యాత్ర బృందం ప్రశంసించింది. ఆ బృందానికి చెందిన 530 మంది సభ్యులు ఇటీవల శ్రీసిటీని సందర్శించారు. ఔత్సాహక పారిశ్రామిక వేత్తలకు మార్గదర్శకం చేసే లక్ష్యంతో ముంబైకి చెందిన జాగృతి సేవా సంస్థాన్ స్వచ్ఛంద సంస్థ ఏటా చేపట్టే ఈ జాగృతి యాత్ర, దేశమంతా పర్యటించి, వివిధ రంగాలలో ఆదర్శవంతులను కలుసు కుని, వారితో సంభాషించడం ద్వారా యాత్రికులలో స్ఫూర్తిని నింపుతుంటుంది. ఈ క్రమంలో ఆ యాత్రా బృందం శ్రీసిటీని సందర్శించడ, ఆ బృందంలో అమెరికా, యూరోప్‌కు చెందిన 13 మంది విదేశీ ప్రతినిధులు కూడా ఉండడం విశేషం. ఈ పర్యటనలో భాగంగా తాము ఆదర్శ వంతమైన పారిశ్రామికవాడగా ఉన్న శ్రీసిటీని ఎంచుకుని, శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డితో ఆ బృందం చర్చించి, పారిశ్రామిక రంగలోని వివిధ అంశాలను అడిగి తెలుసుకుంది.

### పారిశ్రామిక అభివృద్ధికి శ్రీసిటీ ఒక నమూనా - ఎం.డీ రవీంద్ర సన్నారెడ్డి

శ్రీసిటీని ప్రపంచ తయారీ కేంద్రంగా అభివృద్ధి చేస్తున్న సమయంలో తాము ఎదుర్కొన్న సవాళ్లు, అనుభవాలను శ్రీసిటీ ఎం.డీ రవీంద్ర సన్నారెడ్డి వారికి వివరిస్తూ, పారిశ్రామిక అభివృద్ధికి శ్రీసిటీ ఒక నమూనాగా ఉందని వారికి వివరించారు. ప్రస్తుతం 30 దేశాలకు చెందిన 220 పైగా కంపెనీలకు శ్రీసిటీ నిలయంగా మారిందని, ప్రధాని 'వికసిత భారత్' స్ఫూర్తితో, 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మనిర్భర భారత్' చొరవకు ప్రతిబింబంగా శ్రీసిటీ నెలవుగా ఉందని ఆయన చెప్పారు. దాదాపు 65 వేల మంది ఉద్యోగులు (వారిలో సగానికి పైగా మహిళలు), ట్రిపుల్ ఐటీ, క్రియా విశ్వవిద్యాలయం వంటి సంస్థలతో, పరిశ్రమకు విద్యను అనుసంధానం చేసి సరికొత్త పారిశ్రామిక నగరానికి చిహ్నంగా శ్రీసిటీని తీర్చిదిద్దామని ఆయన వివరించారు. జాగృతి యాత్ర వరుసగా ఏడవసారి శ్రీసిటీ సందర్శనకు రావడం తాము అత్యంత గౌరవప్రదంగా భావిస్తున్నామంటూ వారందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. తమ బృందానికి శ్రీసిటీ సందర్శనకు అవకాశం కల్పించిన శ్రీసిటీ యాజమాన్యానికి ఈ సందర్భంగా జాగృతి సంస్థ సీఈఓ అశుతోష్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.



# పవన్‌తో.. ప్రశాంతమ్మ సమావేశం

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో కోవూరు శాసనసభ్యురాలు..తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఇటీవల సమావేశమయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లో దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని అనేక అంశాలను ఆమె ఉప ముఖ్యమంత్రితో చర్చించారు.

## ఉదయగిరి నియోజకవర్గంలో

# ఆగ్రోఫామ్స్ ఏర్పాటుకు కృషి

## ఎమ్మెల్యే కాకర్ల చొరవతో అమెరికా పారిశ్రామికవేత్తల పరిశీలన



జిల్లాలోని మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ చొరవతో, అమెరికాలోని ర్యాలై, నార్త్ కరోలినా ప్రాంతాలకు చెందిన పారిశ్రామికవేత్తలు విమల్ కుమార్ కొలప్ప, శ్రీ సాయి కిరణ్ కొలవెన్ను, పెట్టుబడులు పెట్టేందుకు ఉత్సాహం చూపుతున్నారు. ఆమేరకు పరిశీలనలు కూడా ప్రారంభమయ్యాయి. ఆ పారిశ్రామికవేత్తలతో కలసి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, స్థానిక నాయకులు ఈనెల 24న ఉదయగిరి నియోజకవర్గంలోని కొండాపురం, కలిగిరి మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. వ్యవసాయానికి అనుకూలమైన ఈ ప్రాంతంలో ఆగ్రో ఫామ్స్ ఏర్పాటు చేసేందుకు కొండాపురం మండలం చింతలదేవిలోని కామధేను ప్రాజెక్టును పరిశీలిం చారు. అనంతరం అదే మండలంలోని జంగాలపల్లి గ్రామంలో మెట్టపంటలైన పొగాకును పరిశీలించారు. రైతులతో కలిసి మాట్లాడారు. కలిగిరి మండలం కమ్మవారి పాలెంలో షీప్ ఫార్మ్‌లోని జీవాలను పరిశీలించారు. ఆ ప్రాంతం వ్యవసాయానికి అనువైన ప్రాంతంగా గుర్తించి పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి కనబరిచారు. మెట్ట ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు కృషిచేస్తున్న ఎమ్మెల్యే కాకర్లను నియోజకవర్గ ప్రజలు అభినందిస్తున్నారు.

# ఇంటింటి సర్వేకి సహకరించండి

## • కమిషనర్ సూర్యతేజ


కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన అన్ని సంక్షేమ పథకాలు, నగరపాలకసంస్థ వార్డు సచివాలయాల ద్వారా అందే పౌరసేవలు పొందేందుకు ఇంటింటి సర్వే తప్పనిసరని, ఆ సర్వేకి వచ్చే సచివాలయ కార్యదర్శులకు అందరూ సహకరించాలని నగర కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ ఒక ప్రకటనలో సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, ప్రజలంతా ఆ సర్వేలో తమ ఇంటిని మ్యాపింగ్ చేసుకోవాలని ఆయన కోరారు.






## జానకిరామ.. రామాయణం (41)

- ఊటుకూరు జానకి రామారావు



అమితమైన దుఃఖం మనస్సును ఆవరించింది భరతునకు. పుండుమీద కారం చల్లినట్లు తండ్రి మరణానికి తోడు తల్లి చేసిన బుద్ధిమాలిన పని ఆయనలో అంతులేని వేదన రగిల్చింది.

అనంతమైన ఆవేదన, ఎదురుగా ధర్మాధర్మాలు పాటించని కన్నతల్లి... ఇక ఉండ బట్టలేక, ఓసీ! నీవు కాళరాత్రి వలే నా కులానికి దాపురించావు, నా తండ్రి భగభగమండే కొరివిని కౌగలించుకొంటున్నానని తెలుసుకొనలేకపోయాడు.

నా తండ్రిని ఎందుకు చంపావు, ధర్మాత్ముడైన నా అన్నని ఎందుకు అడవికి పంపావు?

రాముడు తనకు తన కన్నతల్లి ఎలాగో నిన్ను కూడా అలాగే చూసుకున్నాడు కదా! కౌసల్యామాత నిన్ను తోడబుట్టినదాని వలే ఆదరించింది కదా!

రాముడి దర్శనమే పుణ్యం కలిగిస్తుంది. అలాంటి రాముడికి నారచీరలు కట్టి అడవులకు పంపటానికి నీకు మనసెలా ఒప్పింది!

రాముడి పట్ల నాకు గల భక్తి నీకు తెలీదు! రామలక్ష్మణులు దగ్గరలేకుండా ఏ విధంగా పాలించగలననుకొన్నావు, అయినా రాముడిలాంటి పెద్ద వృషభము మోయగల కాడిని నాలాంటి దూడ మోయగలుగుతుందా?

ఇక్ష్వాకుల వంశంలో ఎప్పటికీ జ్యేష్టుడే రాజు!

క్రూరురాలా నీవు కోరిన రాజ్యం ఎప్పటికీ నీకు లభించదు!

నాకు నీవీ లోకంలో గొప్ప అపకీర్తి తెచ్చిపెట్టావు!

నీ తండ్రి అశ్వపతి గొప్ప ధర్మాత్ముడు, ఆయనకు తీరని కళంకం తెచ్చావు. అటు పుట్టినింటికి ఇటు మెట్టినింటికీ తీరని ద్రోహం చేశావు.

రాముని అరణ్యం నుండి తిరిగి రప్పించెదను. నా అన్న రామన్న నా తోటి శాశ్వతంగా మాట్లాడడని నిన్ను చంపకుండా వదిలిపెడుతున్నాను. ఇక ఎంతమాత్రం నీ పాప భారం నేను మోయజాలను... అని భరతుడు పెట్టే కేకలు రాజాంతఃపుర మంతా మారుమ్రోగుతున్నాయి.

భరతుడి గొంతు గుర్తుపట్టిన కౌసల్య, సుమిత్రతో అదిగో భరతుడు వచ్చినట్లున్నాడు.. ఆ గొంతు అతనిదే కదా! అని ఆవిడ అంటూ ఉండగనే భరతశత్రుఘ్నులు పెత్తల్లి చెంతకు చేరారు.

ఆవిడ అప్పటికే భర్త వియోగం, పుత్రుడు దూరమవ్వటం అనే రెండు పదునైన దుఃఖాలు మనస్సును కోస్తూ ఉంటే మాటి మాటికీ సంజ్ఞతప్పి ఏడుస్తూ నేల మీదపడి దొర్లుతూ అత్యంత దయనీయమైన స్థితిలో ఉంది.

అటువంటి కౌసల్యామాతను చూడగనే భరతుడి హృదయంలో అంతులేని వేదన పుట్టింది.

నేలమీద పడి ఉంది మహారాణి కౌసల్య!

మహాధానుష్కుడు, జగదేకవీరుడైన రాముడి కన్నతల్లిని అలా చూడలేకపోయాడు భరతుడు.

వెంటనే జలజలకన్నీరు కారుస్తూ కౌసల్యామాతను లేవనెత్తి ఆవిడను కౌగలించుకొన్నారు భరతశత్రుఘ్నులిరువురూ.

భరతుని చూడగనే కౌసల్య.. నాయనా ఏ శత్రుబాధలేని రాజ్యం నీకు లభించింది కదా! ఏమి ఆశించి నా కొడుకుకు నారచీరలు కట్టబెట్టి నీ తల్లి వాడిని అడవులకు పంపింది. నా కొడుకున్నచోటికే నన్ను కూడ పంపివేయి. ఈ రాజ్యం హాయిగా నీవు ఏలుకోవచ్చు.

పుండును కెలికి సూదితో గుచ్చినట్లున్నాయి కౌసల్యామాత మాటలు. భరతుడి వేదన అంతకంతకూ హెచ్చింది. దానికి అంతం లేకుండా పోయింది.

పెద్దతల్లికి చేతులు జోడించి నమస్కరిస్తూ, అమ్మా! ఏ పాపం తెలియని నన్నెందుకు నిందిస్తావు. అన్నమీద నాకు గల ప్రేమ, భక్తి నీవెరుగనివా?

అమ్మా అన్నగారి అరణ్యవాసానికి నా సమ్మతి ఉన్నట్లయితే..

సూర్యభగవానుడి ఎదురుగా మలమూత్ర విసర్జన చేసే వాడికి ఏ పాపం చుట్టుకుంటుందో అది నాకు చుట్టుకుంటుంది

జీతం ఇవ్వకుండా పనిచేయించుకొన్న యజమానికి ఏ పాపం చుట్టుకుంటుందో అది నాకు కలుగుతుంది.

మాట ఇచ్చి తప్పినవాడికి, ప్రజల రక్షణ మరచిన రాజుకు ఏ పాపం చుట్టుకుంటుందో అది నాకు చుట్టుకుంటుంది.

రణరంగంలో పోరాడి మరణించక వెన్నుచూపి పారిపోయిన వాడికి ఏ పాపం చుట్టుకుంటుందో అది నాకు చుట్టుకుంటుంది.

ఆవులను కాలితో తన్నినవాడికి, పెద్దలను దూషించినవాడికి, మిత్రద్రోహం చేసిన వాడికి ఏ పాపం చుట్టుకుంటుందో అది నాకు చుట్టుకుంటుంది.

ఎదుటివాడు విశ్వాసముంచి చెప్పిన రహస్యాన్ని బహిర్గత పరచినవాడికి ఏ పాపం చుట్టుకుంటుందో అది నాకు చుట్టుకుంటుంది.

ఇంటిలోని భార్యాపిల్లలకు, అతిథులకు, బంధువులకు ఎవ్వరికీ పెట్టకుండా తానొక్కడే మృష్టాన్న భోజనమారగించే వాడికి ఏ పాపం చుట్టుకుంటుందో అది నాకు చుట్టుకొను గాక. అమ్మకూడని వస్తువులు లక్క, మధువు, లోహం, విషం, మాంసం అమ్మేవాడికి ఏ పాపం చుట్టుకుంటుందో అది చుట్టుకొనుగాక.

నాకు ఆ ఉద్దేశ్యమే ఉండినట్లయితే కుండ పెంకు చేతబట్టి చినిగిన గుడ్డలు కట్టి భిక్షమెత్తుకొంటూ, పిచ్చివాడివలే భూమి మీద తిరుగుదును గాక..

సంధ్యా సమయాలలో నిదురించే వాడికి కలిగే పాపం నాకు కలుగు గాక.

పరభార్యా సంగమం చేసిన వానికి ఎట్టిపాపం కలుగునో అట్టిపాపం నాకూ కలుగు గాక.

ఈ విధంగా కౌసల్యను ఓదర్చుటానికి ప్రయత్నం చేస్తూ దుఃఖ భారంతో తాను కూడా నేలమీద పడిపోయాడు భరతుడు.

తీవ్రమైన వేదన దుఃఖాన్ని రగిలించగా విపరీతంగా విలపిస్తూ శపథాలు చేస్తూ ఒట్లు పెట్టుకుంటున్న భరతుని చూసి కౌసల్యామాత దుఃఖం మరింత హెచ్చింది.

రాముడంటే ప్రాణమైన భరతుని దగ్గరకు తీసుకొని తన ఒడిలో కూర్చుండబెట్టుకొని చాలాసేపు దుఃఖిస్తూ అలాగే ఉండిపోయింది.

రాత్రి గడిచిపోయింది.

తెల్లవారుతుండగనే వశిష్ట మహర్షి భరతుడికి చేయవలసిన కార్యాలను గురించి తెలిపి, అందుకు కావలసిన ఏర్పాట్లు చేశాడు.

నూనెలో జాగ్రత్తగా ఉంచిన దశరథుడి కళేబరాన్ని బయటకు తీసి నేలపై ఉంచారు. మహారాజు ఇంకా నిదురిస్తున్నట్లుగనే ఉన్నాడు.

ఆయన పార్థివ శరీరం వద్దకు వెళ్ళి భరతుడు ఎందుకు చేశావయ్యా నీవీ పని? ధర్మమూర్తి రాముడిని అడవులకు పంపే నిర్ణయమెందుకు చేశావు. నా దగ్గర రాముడూ లేడు, నీవూలేవు. ఇక ఈ అయోధ్య భర్తలేని విధవరాలుగా ప్రకాశహీనంగా ఉన్నదయ్యా! అని పరిపరివిధాలుగా రోదించాడు.

దుఃఖభారంతో కుమిలిపోతున్న భరతుడిని వశిష్టుల వారు ఓదార్చి, చేయవలసిన కార్యాలగురించి తొందరపెట్టాడు.

మహారాజు దేహాన్ని పల్లకిలో కూర్చుండబెట్టి స్మశానానికి తీసుకువెళ్ళి చితిమధ్యలో పరుండబెట్టి అనేక విధాలైన సుగంధద్రవ్యాలు చేర్చగా, భరతుడు ఆయన చితికి నిప్పుపెట్టాడు.

ఆయనకు జరిపించవలసిన కర్మలు శాస్త్రోక్తంగా పూర్తిచేసి రాముడి వద్దకు వెళ్ళిపోవాలనే తలంపుతో శత్రుఘ్నునితో కలిసి కూర్చున్నాడు భరతుడు.

ఇద్దరూ మాట్లాడుకుంటున్నారు. సకలలోక రక్షకుడు, మహాబలశాలి, మనకు కష్టాలు వస్తే ఆదుకునే రాముడిని ఒక ఆడుది అడవికి పంపి వేసింది.

ఆ సమయంలో లక్ష్మణుడు ఏం చేస్తున్నట్లు? స్త్రీ వశుడైన తండ్రిని ఎందుకు నిగ్రహించలేకపోయాడు? ఇలా మాట్లాడు కుంటుంటే వారికి అటుగా వెళ్తూ మంథర కనపడింది.

అది వంటి నిండా గంధం పూసుకొని రాణులు అలంక రించుకొనే విధంగా విలువైన వస్త్రాలు ధరించి రకరకాల అలంకారాలతో, నడుముకు వడ్డాణంతో త్రాళ్ళతో కట్టబడ్డ ఆడుకోతిలాగ ఉంది.

దానిని ద్వారపాలకులు పట్టుకొని ఇదిగో ఎవరిమూలంగా రాముడు అడవులపాలయ్యాడో ఆ దరిద్రపుగొట్టు మంథర ఇది... ఏం చేస్తావో చెయ్యి అని శత్రుఘ్నునికి అప్పగించారు.

చేసిన వెధవపనికి ఇది ఫలితం అనుభవించాల్సిందే అంటూ.. ఆ గూనిదానిని జుట్టుపట్టుకొని ఒక ఈడ్పుఈడ్చాడు శత్రుఘ్నుడు.. అప్పుడు అది వేసుకొన్న ఆభరణాలు చెల్లా చెదురుగా పడి ఆ నేల అంతా నక్షత్రాలు పరుచుకొన్న ఆకాశం లాగ కనపడింది.

..(సశేషం)

# మహాయుతి.. మహాయుక్తి

మహారాష్ట్ర ఎన్నికలు కాంగ్రెస్‌కు, ఆ పార్టీ అప్రకటిత అగ్రనేతగా కొనసాగుతున్న రాహుల్ గాంధీకి మరో చేదు అనుభవాన్ని మిగిల్చాయి. రాజకీయ కురువృద్ధుడు శరద్‌పవార్, అసలైన శివసేన ఎవరిదో తేలిపోతుందంటూ బరిలోకి దిగిన ఉద్ధవ్ ఠాక్రేలకు కూడా ఈ ఫలితాలు తీవ్ర నిరాశను మిగిల్చాయి. బీజేపీ 132 స్థానాల్లో విజయం సాధిస్తే.. కాంగ్రెస్, శివసేన ఉద్ధవ్ వర్గం, ఎన్సీపీ–శరద్‌పవార్ పార్టీలతో కూడిన మహా వికాస్ అఘాడీ కూటమి 46స్థానాలకే పరిమితమైంది. 101 స్థానాల్లో పోటీచేసిన కాంగ్రెస్ 16 సీట్లలో మాత్రమే నెగ్గుకొచ్చింది. మహారాష్ట్ర ఏర్పడిన నాటి నుంచి అది ఎన్నడూ లేనంత బలహీనంగా మారింది. ఒక జాతీయ పార్టీగా కాంగ్రెస్ కోలుకోవడానికి ఎంతోకొంత అవకాశాలున్నాయి కానీ ఈ ఫలితాల నుంచి గుణపాఠాలు నేర్చుకోకపోతే ఎన్సీపీ–శరద్‌పవార్ పార్టీ, శివసేన–ఉద్ధవ్ ఠాక్రే పార్టీ క్రమంగా ప్రాభవాన్ని కోల్పోకతప్పదు. తాత్కాలిక రాజకీయ అవసరాల కోసం సిద్ధాంతాలను పక్కనపెట్టడం వల్ల జరిగే నష్టమేమిటో ఉద్ధవ్‌ఠాక్రేకు ఇప్పటికైనా తెలిసివస్తేనే పార్టీ బతికే అవకాశం ఉంది. మరాఠా ప్రాంత అస్తిత్వ ప్రధాన అజెండాగా ఉద్ధవ్ తండ్రి బాల్‌ఠాక్రే శివసేనను ఏర్పాటు చేశారు. మరాఠీ అస్తిత్వవాదంతో సమానంగా హిందూవాదాన్ని కూడా శివసేన మోసేది. హిందూవాదం వద్ద భాజపా – శివసేనల మైత్రి పనిచేసింది. బాల్‌ఠాక్రే మరణం తర్వాత శివసేనకు అసలైన వారసుడెవరు అన్న ప్రశ్న వచ్చినప్పుడు అంతా ఆయన సోదరుడి కుమారుడు రాజ్ ఠాక్రే అనుకున్నారు కానీ వారసుడిగా ఉద్ధవ్ ఠాక్రేనే నిలబడ్డారు. రాజ్‌ఠాక్రే పెట్టుకున్న మహారాష్ట్ర నవనిర్మాణ సేన పెద్దగా ప్రాభవం చూపలేకపోయింది. ఉద్ధవ్ ఠాక్రే శివసేనపై గట్టి పట్టు సాధించగలిగారు. 2019 ఎన్నికల్లో ఎన్డీఏ కూటమిగా కలిసి పోటీ చేసిన భాజపా–శివసేనలు ఫలితాల తర్వాత విడిపోయాయి. పెద్దపార్టీగా అవతరించిన తమకే ముఖ్యమంత్రి పదవి దక్కాలని భాజపా ప్రతిపాదించగా ఉద్ధవ్ ఠాక్రే ససేమిరా అన్నారు. మరాఠీ ప్రాంతీయ అస్తిత్వ వాదాన్ని తెరపైకి తీసుకొస్తూ శివసేనకే (అంటే తనకే) ముఖ్యమంత్రి పదవి కావాలని పట్టుబట్టారు. ఆ పదవి కోసం చివరకు సైద్ధాంతికంగా ఏ మాత్రం సారూప్యం లేని కాంగ్రెస్‌తోకలిసి మహా వికాస్ అఘాడిగా ఏర్పడి ముఖ్యమంత్రి పదవి చేపట్టారు. ఉద్ధవ్ రాజకీయంగా చేసిన అతిపెద్ద పొరపాటు ఇదే. ఎన్సీపీ–శరద్ పవార్ వర్గం,కాంగ్రెస్, శివసేన–ఉద్ధవ్ వర్గం 2024 సాధారణ ఎన్నికల్లో పోటీ చేయగా ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ లాభపడి ఉద్ధవ్ నష్టపోయారు. కాంగ్రెస్‌కు మునుపటితో పోలిస్తే లోక్‌సభ స్థానాలు పెరగ్గా ఉద్ధవ్‌కు తగ్గాయి. ఈ సమీకరణంలో కాంగ్రెస్ లాభపడడానికి కారణం సమాజంలోని మెజార్టీ వర్గమైన హిందూవాద వర్గం ఓట్లు ఎక్కువగా ఆ పార్టీకి బదలాయింపు కావడం. శివసేన (యూబీటీ)తో చేసిన మైత్రి ఆ పార్టీకి అలా కలిసి వచ్చింది. ఇక శివసేన (యూబీటీ)కి గతంతో పోలిస్తే లోక్‌సభ స్థానాలు తగ్గడానికి కారణం హిందూవాద మెజార్టీవర్గం ఓట్లు ఆ పార్టీ, ఏక్నాథ్ శిందే నేతృత్వంలోని శివసేన, భాజపా మధ్య చీలి ఉద్ధవ్ పార్టీ గతంతో పోలిస్తే తక్కువ స్థానాలు గెలుచుకుంది. తాజాగా జరిగిన శాసనసభ ఎన్నికల్లో హిందూవాద ఓట్లు ఎక్కువగా భాజపాకు బదిలీ అయినట్లు స్పష్టమవుతోంది. దీనికి తోడు మరాఠా రిజర్వేషన్ల అంశాన్ని భాజపా తెలివిగా వాడుకుంది. మరాఠాలకు రిజర్వేషన్లను భాజపా బహిరంగంగా వ్యతిరేకించ కుండా చాపకింద నీరులా మిగిలిన వర్గాలన్నింటినీ ఏకం చేసి వారి ఓట్లు తమకు పడేలా యుక్తి పన్నింది. ఈ వ్యూహం బాగా పనిచేసినట్లు ఓట్ల సరళిని బట్టి అర్థమవుతోంది. మరోవైపు మరాఠా వర్గానికే చెందిన ఏక్‌నాథ్ శిందే మహాయుతి కూటమిలోనే ఉండడం, మరాఠా వర్గానికి ఆయన ప్రభుత్వం 10శాతం కోటాను కల్పించడం వల్ల మరాఠా వర్గం కూడా మహాయుతి కూటమి వైపే మొగ్గు చూపినట్లు ఓట్ల సరళిని బట్టి అర్థమవుతోంది. ఈ రకంగా మహాయుతి.. మహాయుక్తితో శాసనసభ ఎన్నికల్లో విజయదుందుభి మోగించింది.

## ఝార్ఖండ్‌లో బెడిసికొట్టిన భాజపా వ్యూహం

ఝార్ఖండ్‌లో ఆదివాసీల ఓట్లను గుంపగుత్తగా కొల్లగొట్టడానికి భాజపా ఎంచుకున్న ఎత్తగడ ఫలించలేదు. బంగ్లాదేశ్ నుంచి ముస్లింల చొరబాట్ల కారణంగా ఝార్ఖండ్ తన ఆదివాసీ అస్తిత్వాన్ని కోల్పోతోందని, ఆదివాసీలపై అఘాయిత్యాలు జరుగుతున్నా యని చెబుతూ ఈ అంశాన్నే ప్రధాన ప్రచార అస్త్రంగా చేసుకుంది. అయితే ఈ అస్త్రాన్ని ఝార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం)సమర్థంగా అడ్డుకుంది. దీంతో రాష్ట్రంలో ఆదివాసీలకు కేటాయించిన 28 స్థానాల్లో 27 స్థానాల్లో ఎన్డీఏ ఓడిపోయింది. భాజాపా ఏకంగా ఇక్కడ 25 స్థానాల్లో పోటీచేసింది. జేఎంఎం అగ్రనేత హేమంత్ సోరెన్ ఈడీ కేసులో అరెస్టయినప్పుడు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆ పార్టీ నేత చంపాయి సోరెన్ ఆ తర్వాత భాజపాలో చేరారు. ఆయన ఒక్కరే ఎన్డీఏ తరఫున ఆదివాసీల స్థానం నుంచి గెలుపొందారు. ముస్లింల చొరబాట్లని భాజపా చేసిన ప్రచారాన్ని జేఎంఎం సమర్థంగా ఎదుర్కొంది. కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపా నేతృత్వంలోని ప్రభుత్వమే బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లను అడ్డుకోవాలని, అందులో విఫలమైందని జేఎంఎం బలంగా ప్రచారంచేసి విజయం సాధించింది. ఇక రాష్ట్రంలో భాజపా తరఫున ప్రముఖ ప్రచారకర్తలుగా ఉన్న బయటి నేతలు వారి సొంత రాష్ట్రాల్లో గిరిజనులు, ఆదివాసీలపై అత్యాచారాలను అడ్డుకోలేకపోయా రని ఎదురుదాడికి దిగింది. ఝార్ఖండ్ నుంచి సంతాల్ పరగణాను విడదీయాలన్న భాజపా ఎంపీ సూచనను ప్రస్తావిస్తూ ఝార్ఖండ్‌ను భాజపా ముక్కలు చేయాలనుకుం టోందని బలంగా ప్రచారం చేసింది. దీంతో భాజపా వ్యూహం బెడిసికొట్టింది.

## సూపర్ హిట్ జోడి



జేఎంఎం అగ్రనేత హేమంత్ సొరేన్‌ను ఈడీ అరెస్టు చేయడం ఆదివాసీల్లో ఆయనపై సానుభూతిని పెంచడంతో పాటు భాజపాపై వ్యతిరేకత ఏర్పడడానికి కారణమయింది. భర్త జైలులో ఉన్నప్పుడు రాజకీయాల్లోకి వచ్చిన కల్పనా సోరెన్ రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ భాజపా తీరును ఎండగడుతూ ప్రజల్లోకి చొచ్చుకుపోయారు. హేమంత్, కల్పన కలిసి ఏకంగా 200సభల్లో పాల్గొన్నారు. ఈ జోడీ ధాటికి భాజపా కుదేలయిపోయింది.

తుమ్మల బాల గంగాధర్ తిలక్

# పార్లమెంట్‌లో గళమెత్తిన విపిఆర్



- 'ఖేలో ఇండియా' పరిస్థితేమిటి?..
- నిరుపేద విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల సంగతేమిటి?..
- టూరిజం అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలేమిటి?..

నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) ఇటీవల పార్లమెంట్‌లో పలు సమస్యలపై గళమెత్తారు. పలు ప్రశ్నలు గుప్పించి, కేంద్రం నుంచి సమాధానాలు రాబట్టారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఖేలో ఇండియా' పథకం కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏర్పాటు చేసిన క్రీడా సదుపాయాలు తెలియజేయాలని సంబంధిత మంత్రిని కోరారు. అందుకు స్పందించిన కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. క్రీడలు రాష్ట్ర పరిధి అయినందున, క్రీడా కేంద్రాలు, స్టేడియంలు, కాంప్లెక్స్ నిర్మాణంతో సహా క్రీడల అభివృద్ధి బాధ్యత ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంటుందని, కేంద్ర ప్రభుత్వం వారి ప్రయత్నాలకు తోడ్పాటునందిస్తుందని తెలిపారు.


ఖేలో ఇండియా పథకం కింద మంజూరు చేయబడిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను పూర్తి చేయడానికి రెండు సంవత్సరాలు కాల పరిమితి ఉంటుందని, ప్రాజెక్టుల అమలు బాధ్యత మంజూరుదారులదేనని మంత్రి సమాధానమిచ్చారు.

## స్కాలర్‌షిప్‌ల వివరాలేమిటి?..

కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో, అర్హతే ప్రమాణాలుగా ఆర్థిక సహాయం, పునరుద్ధరణ అవసరాలతో సహా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు అందుబాటులో ఉన్న స్కాలర్‌షిప్‌ల వివరాలు తెలియజేయాలని విపిఆర్ లోక్‌సభలో ప్రశ్నించారు. అందులోభాగంగా గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ నుంచి, ముఖ్యంగా నెల్లూరు, ప్రకాశం జిల్లాల నుంచి స్కాలర్‌షిప్‌ల కింద మొత్తం లబ్దిదారుల వివరాలు కోరారు. కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి సుఖంత మజుందార్ సమాధానమిస్తూ, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రభుత్వం వివిధ స్కాలర్‌షిప్ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఆ పథకాల వివరాలు ఆయా వెబ్‌సైట్లలో అందుబాటులో ఉన్నాయన్నారు. అంతేకాకుండా, సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ, వికలాంగుల సాధికారత విభాగం, గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ మరియు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఇతర వెనుకబడిన తరగతులకు చెందిన నిరుపేద విద్యార్థులందరికీ వారి తల్లిదండ్రుల ఆదాయ పరిమితి ఆధారంగా స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నామని చెప్పారు.

## టూరిజం అభివృద్ధికి ఏం చర్యలు తీసుకుంటున్నారు?

దేశంలోని ఐల్యాండ్స్, తీరప్రాంతాలకు మాత్రమే పరిమితం కాకుండా క్రూయిజ్ టూరిజాన్ని ఇతర ప్రాంతాలకు విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటోందో వివరించాలని వేమిరెడ్డి లోక్‌సభలో కోరారు. క్రూయిజ్ టూరిజంలో ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దీని అభివృద్ధికి ఏం చేస్తున్నారో చెప్పాలని అడిగారు. అందుకు, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు. దేశంలో క్రూయిజ్ టూరిజం అభివృద్ధికి వీలు కల్పించే పర్యావరణ వ్యవస్థను రూపొందించడానికి, సమన్వయం కోసం అన్ని ప్రధాన ఓడరేవుల ప్రతినిధులు, వాటాదారులతో పర్యాటక మంత్రిత్వ శాఖ, షిప్పింగ్ మంత్రిత్వ శాఖ సంయుక్తంగా క్రూయిజ్ టూరిజంపై టాస్క్ ఫోర్స్ కమిటీని కూడా ఏర్పాటు చేసిందని తెలిపారు.



## ముఖ్యమంత్రిని కలసిన.. రావి మోహన్‌చౌదరి

ఇటీవల అసెంబ్లీలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కలసి పార్టీకి సంబంధించిన పలు అంశాలను చర్చిస్తున్న తెలుగుదేశం పార్టీ కర్నాటక సమన్వయకర్త, మన నెల్లూరీయుడు రావి మోహన్‌చౌదరి.

## ఎన్‌బికెఆర్‌లో కంటివైద్య శిబిరం



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఇటీవల కంటి వైద్యశిబిరం నిర్వహించి విద్యార్థులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంవదికి కంటి పరీక్షలు చేశారు. నెల్లూరులోని డాక్టర్ హెచ్ ఆర్ స్మార్ట్ విజన్ ఐ హాస్పిటల్ వారి సహకారంతో ఏర్పాటుచేసిన ఈ వైద్యశిబిరంలో డాక్టర్ డి.సందీప్ పాల్గొని కంటి పరీక్షలు చేసి, కంటి సమస్యలున్న వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయ కుమార్‌రెడ్డి, అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

---

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# తిరుమలకు కొత్త బస్సు



గూడూరు పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఈ నెల 26న గూడూరు నుండి తిరుమలకు వెళ్ళే కొత్త ఆర్టీసీ బస్సును ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం డిపో ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని, ఇటీవల రవాణాశాఖ మంత్రిని కలిసి తిరుమలకు బస్సులను ఏర్పాటు చేయమని కోరుతూ వినతిపత్రం అందించడం జరిగిందని, ఈరోజు కొత్త బస్సును ప్రారంభించానని, త్వరలో మరో రెండు బస్సులు రానున్నాయని తెలిపారు. డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు, నాయకులు శీలం కిరణ్‌కుమార్, బిల్లు చెంచురామయ్య, రహీం, జగన్మోహన్‌రెడ్డి, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు నిబంధనలు పాటించాలి



గూడూరులోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవల రోడ్డు నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గూడూరు ఆర్.టి.ఓ బి.ఎస్.కె.కిషోర్, మోటర్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ కె.ప్రభాకర్‌లు విద్యార్థులకు రోడ్డు నిబంధనల గురించి తెలియజేశారు. విద్యార్థులు ట్రిపుల్ రైడింగ్‌కు, ర్యాష్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని, ముఖ్యంగా హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని సూచించారు. కళాశాల డైరెక్టర్ డా.దత్తాత్రేయశర్మ, ప్రిన్సిపాల్ డా. వి.రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



### విజయదుర్గ అమ్మవారికి

## నవావరణయోగం

కార్తీక అమావాస్య సందర్భంగా ఈ నెల 30న గూడూరులోని శ్రీ విజయదుర్గ అమ్మవారి ఉపపీఠంలో సామూహిక కార్తీక దీప పూజ, అమ్మవారి నవావరణయోగం, రుద్రాక్ష లింగానికి అభిషేకం మరియు కార్తీక దీప మహోత్సవం జరుగుతుందని, భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించి వారి కృపకు పాత్రలు కావాలని నిర్వాహకులు కోట సునీల్‌కుమార్ తెలిపారు.

## ఎమ్మెల్యేకి సత్కారం

గూడూరును నెల్లూరుజిల్లాలో కలపాలంటూ అసెంబ్లీలో ప్రస్తావించిన గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌ను ఇటీవల అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో వాకర్స్ హెల్త్ క్లబ్, పలువురు క్రీడాకారులు ఘనంగా సన్మానించారు. అనంతరం వాకర్స్ హెల్త్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాలుగు సిమెంట్ బెంచీలను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడుతూ స్టేడియం అభివృద్ధికి నూతన గ్యాలరీ, ప్రహరీ గోడ రిపేర్లు చేస్తామని తెలిపారు. వాకర్స్ హెల్త్‌క్లబ్ అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్, వసంత్‌కుమార్, శర్మ, వేమా వెంకటేశ్వర్లు, రత్నాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



## రాజ్యాంగం పట్ల అవగాహన కలిగి ఉండాలి

### -ఎస్‌కెఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్

భారత రాజ్యాంగం ఆవిర్భావం, రాజ్యాంగంలో పొందుపరచిన అంశాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని గూడూరు ఎస్‌కెఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్ పేర్కొన్నారు. ఈ నెల 26వ తేదీ గూడూరులోని ఎస్‌కెఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 75వ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శివప్రసాద్ మాట్లాడుతూ ఈరోజు మనం అనుభవిస్తున్న ప్రజాస్వామ్యం భారత రాజ్యాంగ ఫలితమని, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సమసమాజ స్థాపన నిర్మాణం ప్రారంభించారని కొనియాడారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినీవిద్యార్థులు అధ్యాపకులు రాజ్యాంగ ప్రవేశికను పఠించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసులు, రవి రాజు, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

అనంతరం ఎస్.కె.ఆర్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు బెంగుళూరుకి చెందిన ఇంట్రన్జలెర్న్ సంస్థ ప్రతినిధులు ఇంటర్న్‌షిప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శివప్రసాద్ మాట్లాడుతూ ఇంటర్న్‌షిప్‌ల ద్వారా విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకుని, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని పేర్కొన్నారు.

## నిరుపేదలకు 'ప్రగతి' సేవలు



గూడూరు, బాలాజీనగర్‌లోని ప్రగతి సేవా సంస్థ కార్యాలయంలో ఇటీవల పొణకా మల్లికార్జునరెడ్డి సహకారంతో 15 నిరుపేద కుటుంబాలకు 18 రకాల పల సరుకులను పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, కాటూరి శ్రీనివాసులు, రవి తదితరులు పాల్గొన్నారు.

# అటకెక్కుతున్న అంబేడ్కర్ రాజ్యాంగం!

(మొదటిపేజీ తరువాయి)



ఇంతవరకూ అంతా బాగానే ఉంది. చదవడానికి, వినడానికి ఆసక్తి కలుగుతోంది. అయితే, డెబ్బైనాలుగేళ్ళ క్రితం మనం రూపొందించుకున్న రాజ్యాంగం ఇప్పుడు దేశంలో సక్రమంగా అమలవుతోందా? మన రాజ్యాంగంలో మనం పొందుపరచుకున్న నియమ నిబంధనలను నేతలు చిత్తశుద్ధితో పాటిస్తున్నారా? ప్రధాన వ్యవస్థల మధ్య సమన్వయం ఉందా? రాజ్యాంగంలో ఉన్న విధంగా చట్టాలు అమలవుతున్నాయా? కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిజమైన రాజ్యాంగాన్ని అనుసరించి పాలన సాగిస్తున్నాయా..? ఇలాంటి అనుమానాలు అనేకం సామాన్యుల నుండి వ్యక్తమవుతున్నాయి.

## రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు...

భారతదేశంలో ప్రస్తుతం ప్రమాదకర ధోరణులు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా రాజకీయపార్టీల ముసుగులో నేతలు వ్యవహరిస్తున్న తీరును రాజ్యాంగం పట్ల గౌరవం, నమ్మకం కలిగి ఉన్న పౌరులు జీర్ణించుకోలేకపోతున్నారు. బలమున్నవాడిదే రాజ్యం అన్నట్లు పరిస్థితులు మారుతున్నాయి. కండ బలం, ధన బలం ఉన్నవారి మాటే చెల్లుబాటవుతోంది. సమాజం పెద్దగా గుర్తించని మరో ప్రమాదకర పోకడ కూడా అంతకంతకీ పెరుగుతోంది... అదే మేధో బలం. వినడానికి కొత్తగా ఉన్నా.. ఇది ముమ్మాటికీ నిజం. మేధావులుగా చలామణీ అయ్యేవారు, మేధో బలం ఉన్నవారు.. మేధస్సు లేని జనసమూహం పట్ల వివక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు. సమాన అవకాశాలు అందకుండా చేస్తున్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు పొడుస్తున్నారు. ముఖ్యంగా నేతలు-అధికారగణం చేతులు కలిపి ప్రజలపై పెత్తనం చలాయిస్తున్న తీరు దారుణంగా ఉంది. అధికారం ప్రజాసేవ కోసమే అన్న విలువైన సూత్రాన్ని వారు ఎప్పుడో మరిచిపోయినట్లు కనబడుతోంది.

## తెలంగాణలో...

తెలంగాణ రాష్ట్రంలో పదేళ్ళ పాటు ముఖ్యమంత్రిగా అధికారం చలాయించి పూర్తి నియంతలాగా వ్యవహరించిన మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు తాను అధికారంలో ఉన్నప్పుడు తన పార్టీ సహచరులు, మంత్రులతో జరిగిన ఒక సమావేశంలో అన్న కొన్ని మాటలు గుర్తుతెచ్చుకుంటే సామాన్యుల వెన్నులో చలి పుడుతుంది. "పోలీసులున్నదెందుకు? పోలీసు అధికారాన్ని ఉపయోగించేందుకే? పోలీసు పవరే అసలైన పవర్. ఎదురు మాట్లాడిన వారికి పోలీసు మార్కు చికిత్స రుచిచూపించండి" అని హుకుం జారీ చేశారు. ఆయన వైఖరికి సొంత పార్టీ నేతలే ముక్కున వేలేసుకున్నారు. ఆయన హయాంలో పోలీసులు ఆయన అన్నంత పనీ చేశారు. ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. కేసీఆర్ రాజ్యాంగాన్ని అమలు చేశారు. ఆ క్రమంలో ఆయన చేయించిన ఒక అరెస్టే ఆయన గద్దె దిగడానికి బీజం వేసింది. ప్రస్తుతం అధికారంలో ఉన్న రేవంత్‌రెడ్డి కూడా ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తున్నారు. ఆయన కూడా కాంగ్రెస్‌పార్టీ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారు. ఫలితంగా గద్దెనెక్కిన ఏడాది లోనే ప్రజల్లో వ్యతిరేకతను మూటగట్టుకుంటున్నారు. రాజ్యాంగ పరమైన ప్రక్రియలు సరిగా అనుసరించకుండా ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నారు. హైడ్రా వంటి చట్టాలతో వారి బ్రతుకులు తారుమారయ్యే నిర్ణయాలు తీసుకుంటున్నారు.

## ఆంధ్రాలో...

రాజశేఖరరెడ్డి వారసుడిగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో ఒక కెరటంలా దూసుకొచ్చారు. ఐదేళ్ళపాటు అధికారం చలాయించారు. తన పదవీకాలంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఏకపక్షంగా వ్యవహరించారు. ఆయన వ్యవహరించిన తీరు చూసి ప్రజలు విస్తుపోయారు. అసలు రాజ్యాంగం అనేది ఉందా..? అన్న అనుమానాలు వ్యక్తం చేశారు. ఆ స్థాయిలో జగన్ తన సొంత రాజ్యాంగాన్ని అమలు చేశారు. తనకి నచ్చని వారిని జైల్లో పెట్టించారు. తనని విమర్శించిన వారిపై కేసులు బనాయించారు. తనకి ఎదురు తిరిగితే.. వారి వ్యాపారాలపై అధికార వ్యవస్థల చేత దాడులు చేయించారు. ఆ ఐదేళ్ళు జగన్‌తో పాటు ఆయన చుట్టూ ఉన్న ఆ నలుగురు చెప్పినట్లల్లా విని గంగిరెద్దుల్లా తలాడించిన అధికారులు ఇప్పుడు తలలు పట్టుకుంటున్నారు. కేసులు ఎదుర్కొంటున్నారు. కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు.

రాజ్యాంగం నిర్దేశించిన విధివిధానాలని, రాజ్యాంగంలో పొందుపరచిన చట్టాలను వారు అనుసరించి ఉంటే వారికి ఇప్పుడు ఈ తిప్పలు ఉండేవి కావు.

ప్రస్తుతం అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ కూడా అధికారులు, పోలీసులపై ఒత్తిడి పెంచుతోంది. గత అయిదేళ్ళుగా తమ పార్టీ నేతలను వేధించిన వారి సంగతి తేల్చమని వివిధ శాఖల వారిని పురమాయిస్తోంది. తన యువగళం పాదయాత్రలో మంత్రి లోకేష్ ప్రస్తావించిన 'రెడ్‌బుక్' రాజ్యాంగం ఇప్పటికే అమలవుతోంది. తమని ఇబ్బందిపెట్టిన వారిని ఎవరినీ వదిలిపెట్టబోమని ఆయన చెప్పిన మాటలు నిజమవుతున్నాయి. తాజాగా జరుగుతున్న పరిణామాలను గమనిస్తుంటే.. ఆ విషయం స్పష్టమైపోతోంది. చట్టానికి విరుద్ధంగా వ్యవహరించి ఉంటే చర్యలు తీసుకోవాల్సిందే! కానీ, దానికి 'రెడ్‌బుక్', 'రెడ్డీబుక్' వంటివి ప్రాతిపదిక కాకూడదు. ఇలాంటివన్నీ రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమే. నాడు జగన్‌మోహన్‌రెడ్డి రాజ్యాంగం, రాజారెడ్డి రాజ్యాంగం అని విమర్శించిన వారే, ఇప్పుడు చంద్రబాబు, లోకేష్ బాబుల రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారు.

## ఉత్తరప్రదేశ్‌లో....

ఇక ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ మొదలుపెట్టిన బుల్‌డోజర్ సంస్కృతి దేశవ్యాప్తంగా విస్తరిస్తోంది. ఇది పూర్తిగా రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. ఒక వ్యక్తి చేసిన తప్పునకు చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి తప్పించి ఆ వ్యక్తి కుటుంబసభ్యులకు ఉన్న ఫళాన నిలువ నీడ లేకుండా చేయడమేమిటని సుప్రీంకోర్టు తప్పుబట్టింది. ఒక వ్యక్తి చేసిన తప్పుకి అతని భార్య, పిల్లలు, తల్లిదండ్రులు శిక్ష అనుభవించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేసింది. యోగి ప్రభుత్వ విధానం సరికాదని తేల్చిచెప్పింది.

## దేశమంతా ఇదే పోకడ...

ఇలా అధికారంలో ఉన్న నేతలు కళ్ళుమూసుకుపోయి వ్యవహరిస్తున్నారనడానికి, సొంత రాజ్యాంగాన్ని అనుసరిస్తున్నారనడానికి ఇంకా చాలా ఉదాహరణలున్నాయి. డెబ్బై అయిదేళ్ళ క్రితం ఎందరో త్యాగధనులు ప్రాణాలొడ్డి సాధించుకున్న స్వతంత్ర భారతదేశం మనది. అలాంటి దేశంలో సామాన్యుడి హక్కులకి రక్షణ లేకపోవడం శోచనీయం. "అర్ధరాత్రి మహిళ ఒంటరిగా తిరగగలిగినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లు" అని మహాత్మా గాంధీ అన్నారు. కానీ, అధర్మాన్ని, అకృత్యాలని, అనైక్యతని ఎదిరించి ఒక మగాడు కూడా ధైర్యంగా తిరగలేని దౌర్భాగ్యపు పరిస్థితులు దేశంలో నెలకొన్నాయి. తెలంగాణ, ఆంధ్ర, ఉత్తర ప్రదేశ్‌లు వంటివి కేవలం ఉదాహరణలు మాత్రమే. ప్రతిచోటా ఇదే దుస్థితి. ప్రతి రాష్ట్రంలోనూ ఇదే పరిస్థితి. చివరికి దేశాన్ని పాలిస్తున్న పెద్దలు కూడా తమ సొంత రాజ్యాంగాన్నే అమలు చేస్తున్నారు. తమకి ఎదురు తిరిగితే ఈడీ, సిబిఐ లాంటి శక్తివంతమైన శాఖలని ప్రయోగిస్తున్నారు.

రాజకీయపార్టీల వైఖరిలో మార్పు వచ్చినప్పుడే మన దేశానికి నిజమైన స్వాతంత్ర్యం సిద్ధించినట్లు. నాయకులు తమ స్వార్థపూరిత విధానాలకి స్వస్తి పలికినప్పుడే స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు సార్థకత లభించినట్లు. సామాన్యుడు సైతం తనకి జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించి తన హక్కుల కోసం ధైర్యంగా పోరాడగలిగినప్పుడే నిజమైన రాజ్యాంగం అమలైనట్లు. అంత వరకూ అంబేడ్కర్ రాజ్యాంగం అటకెక్కినట్లే...!

# తిరుమలలో.. సామాన్య భక్తులకే పెద్దపీట!

## - దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



తిరుమలలో సామాన్య భక్తులకు పెద్దపీట వేసేలా అన్ని చర్యలు తీసుకున్నామని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. ఈనెల 28న తిరుమలలో ఆయన శ్రీ వెంకటేశ్వరస్వామి నేత్ర దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో దెబ్బతిన్న తిరుమల ప్రతిష్టను ఇనుమడింప చేసేందుకు తమ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు సత్ఫలి తాలిస్తున్నాయని చెప్పారు. స్వామి వారి ప్రసాదాల్లో ఉన్నత శ్రేణి నాణ్యతా ప్రమాణాలు కనిపిస్తున్నాయని, భక్తులందరూ స్వామివారి దర్శనం, ప్రసాదాల విషయంలో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. గతంలో ఫిర్యాదుల పుస్తకం కూడా కనిపించకుండా చేశారని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భక్తులందరికీ కూడా ఫిర్యాదుల పుస్తకాన్ని అందుబాటులో ఉంచామని తెలిపారు. భక్తులందరికీ సంతృప్తికర సేవలు అందించడమే ప్రధాన లక్ష్యంగా, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆలోచనల మేరకు తిరుమలలో అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు.

## 'లంగ్ లైఫ్ స్క్రీనింగ్' ద్వారా..

# ఊపిరితిత్తుల క్యాన్సర్ గుర్తింపు

- దేశంలోనే తొలిసారిగా నెల్లూరు అపోలో ఆసుపత్రిలో ప్రారంభం



ప్రాణాంతకమైన ఊపిరితిత్తుల క్యాన్సర్లను ముందుగానే గుర్తించి, తద్వారా మరణాల సంఖ్యను తగ్గించడమే లక్ష్యంగా అపోలో హాస్పిటల్స్ గ్రూప్ ముందడుగు వేస్తోంది. దేశంలోనే మొట్టమొదటిసారిగా నెల్లూరులోని అపోలో ఆసుపత్రిలో 'లంగ్ లైఫ్' పేరుతో ఊపిరితిత్తుల స్క్రీనింగ్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించడం విశేషం. నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్‌సతీష్ ఆ విషయాన్ని వెల్లడించారు. ఈనెల28న నెల్లూరులోని అపోలో హాస్పిటల్‌లో వైద్యులతో కలిసి ఊపిరితిత్తుల స్క్రీనింగ్ పరీక్షలను ప్రారంభించిన తర్వాత, అపోలో వైద్యులు.. అంకాలజీ సర్జన్ డాక్టర్ మనోభిరామ్, అంకాలజీ ఫిజీషియన్ డాక్టర్ హరిత, పల్మనాలజిస్టులు డాక్టర్ ఉమామహేష్, డాక్టర్ శ్రావణితో కలిసి డాక్టర్ శ్రీరామ్ మాట్లాడారు. క్యాన్సర్ వ్యాధులను నివారించే చికిత్సలు అందించడంలో అపోలో అగ్రగామిగా ఉందని, అపోలో ఆసుపత్రిలో అతితక్కువ ఖర్చుతోనే క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నామని చెప్పారు.

# ఇకపై డిజిటల్ పాన్ కార్డులు

- ఈ-మెయిల్ ద్వారా పన్ను చెల్లింపుదారులకి ఉచితంగా అందజేత
- కార్డు రూపంలో కావాలంటే రూ.50 చెల్లించాలి

***భారతదేశ ఆదాయ పన్ను శాఖ పన్ను చెల్లింపుదారుల సమాచారాన్ని డిజిటలైజేషన్ చేస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే పన్ను చెల్లింపుదారులు వినియోగించుకుంటున్న పాన్(పర్మినెంట్ అకౌంట్ నంబర్) కార్డుని డిజిటలైజేషన్ చేస్తోంది. పాన్2.0 ప్రాజెక్టు క్రింద ఈ ప్రక్రియని మొదలుపెట్టినట్లు ఆ శాఖ ఒక ప్రకటన ద్వారా తెలిపింది.***

పాన్‌కార్డుతో టాన్(టాక్స్ డిడక్షన్ & కలక్షన్ అకౌంట్ నంబర్) కార్డుని కూడా అనుసంధానం చేస్తున్నారు. ప్రపంచస్థాయి ప్రమాణాలని దృష్టిలో పెట్టుకుని పన్ను చెల్లింపుదారులకు ఈ సౌలభ్యాన్ని కల్పిస్తోంది. పాత కార్డు స్థానంలో కొత్తగా ఇచ్చే పాన్‌కార్డుని పన్ను చెల్లింపుదారుల ఈ-మెయిల్‌కి నేరుగా పంపే ఏర్పాటు చేస్తోంది. ఈ కార్డు కోసం చెల్లింపుదారులు ఎలాంటి దరఖాస్తు చేసుకోవలసిన అవసరం లేదు. ఎలాంటి రుసుము కూడా చెల్లించే పనిలేదు. ఉచితంగానే ఆదాయపన్ను శాఖ ఈ సౌకర్యాన్ని కల్పిస్తుంది. ఒకవేళ ఎవరికైనా హార్డ్ కాపీ కార్డు రూపంలో కావాలంటే మాత్రం 50 రూపాయలు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

డిజిటలైజేషన్ చేస్తున్న కార్డులో క్యూఆర్ కోడ్‌ని కూడా ఇస్తున్నారు. ఆ కోడ్‌ని స్కాన్‌చేస్తే పన్ను చెల్లింపుదారుడి వివరాలు చిరునామాతో సహా వస్తాయి. పన్ను చెల్లింపుదారులు తమ లావాదేవీలను సులభంగా జరుపుకోవడానికి వీలుగా ఈ కొత్త విధానాన్ని పరిచయం చేస్తున్నట్లు ఆ శాఖ తెలిపింది. డిజిటల్ పాన్‌కార్డు ద్వారా ఆన్‌లైన్‌లో పన్ను చెల్లింపులు, తమకి రావలిసిన బకాయి వివరాలు వంటివి త్వరితగతిన తెలుసుకోవచ్చు. అంతేకాకుండా పన్ను చెల్లింపుదారుల లావాదేవీలని అత్యంత సురక్షితంగా, భద్రంగా ఉంచేందుకు కూడా ఈ డిజిటల్ పాన్‌కార్డు ఉపయోగపడుతుందని ఆదాయపన్ను శాఖ తెలుపుతోంది. కొత్త విధానం ద్వారా నకిలీ పాన్‌కార్డులని కూడా ఏరిపారేయాలన్నది ఆ శాఖ ఆలోచన.



## ఎన్‌సిసి దినోత్సవం సందర్భంగా..

# ఎన్‌బికెఆర్‌లో 'ఫోటో' ప్రదర్శన'

ఈనెల 24న ఎన్‌సిసి దినోత్సవం సందర్భంగా, కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్‌సిసి క్యాడెట్ల సేవలను ఫోటో ప్రదర్శనగా ఏర్పాటుచేశారు. 2017లో ఎన్‌బికెఆర్‌లో ఎన్‌సిసి ఆర్మీ యూనిట్ స్థాపించిన నాటి నుండి నేటి వరకు ఎన్‌సిసి క్యాడెట్లు చేసిన సేవా కార్యక్రమాలు, సాధించిన ఘనతలు మరియు కళాశాలకు, ఎన్‌సిసికి పేరు తెచ్చిన సందర్భాలకు సంబంధించిన ఫోటోలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను ప్రారంభించిన కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, తమ కళాశాల ఎన్‌సిసి ఆర్మీ క్యాడెట్లు గత 7 సంవత్సరాల నుండి అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడమే కాక, ఎన్నో ఘనతలు సాధించినట్లు తెలిపారు. ఎన్‌సిసి క్యాడెట్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఇంకా గొప్ప కార్యక్రమాలు చేయాలి అని సూచించారు. 2-ఆంధ్ర ఇఎంఇ యూనిట్ ఎన్‌సిసి కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అరుణ్ కుమార్ మరియు కల్నల్ దినేష్ ఆదేశాల మేరకు, ఎన్‌సిసి ఆఫీసర్ గోవిందు మాధవయ్య సూచనతో ఈ ఫోటో ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. ఎన్‌సిసి క్యాడెట్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

**నావెల్ క్యాడెట్ల సైకిల్ ర్యాలీ :**



ఎన్‌సిసి దినోత్సవం సందర్భంగా ఇటీవల విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్టీలో ఈనెల 24న ఎన్‌సిసి నావెల్ క్యాడెట్లు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. నెల్లూరు యూనిట్ కమాండింగ్ ఆఫీసర్..లెఫ్టినెంట్ క్యాడర్ గణేష్ గోడంగావే ఆదేశాల మేరకు 40మంది విద్యార్థులు ఈ ర్యాలీ చేపట్టారు. అనంతరం, దేశం కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన సైనికులకు నివాళులు అర్పించారు. ఎన్‌బికెఆర్ నావెల్ యూనిట్ ఆఫీసర్ సబ్ లెఫ్టినెంట్ వి.మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎస్అండ్‌హెచ్ విభాగాధిపతి డాక్టర్ సి.రవీంద్రరెడ్డి పాల్గొని, జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు.

## రాజ్యాంగ దినోత్సవ పోటీల్లో..

# సత్తాచాటిన జిల్లా విద్యార్థులు


రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా గుంటూరులో ఇటీవల జోనల్ స్థాయిలో జరిగిన పోటీల్లో నెల్లూరుజిల్లా విద్యార్థులు సత్తాచాటారు. వక్తృత్వ విభాగంలో సీబీ నగర్ నగరపాలక పాఠశాల విద్యార్థులు ఏ.ప్రవీణ్, విష్ణువర్ధన్‌లు ప్రథమ స్థానం సాధించారు. అదేవిధంగా వ్యాసరచన పోటీల్లో గండవరం జడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థిని బి.సుచిత్ర ప్రథమస్థానం సాధించగా, వక్తృత్వ పోటీల్లో చెన్నపల్లిపాళెం జడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థిని బి.లాలస ద్వితీయస్థానం కైవసం చేసుకుంది. దేశభక్తి గీతాల విభాగంలో జరిగిన పోటీలో గండవరం జడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థిని బి.సుచిత్ర తృతీయస్థానంలో నిలిచింది. ఆ విద్యార్థులను డీఇఓ బాలాజీరావు, డెప్యూటీ ఇఓలు ప్రసన్నలక్ష్మి, రఘురామయ్య, ఎంఇఓలు, ప్రధానోపాధ్యాయులు అందరూ అభినందించారు.

# వలంటీర్ల ధర్నాందోళన

గ్రామ-వార్డు వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ ఈనెల 25న నెల్లూరు కలెక్టరేట్ వద్ద వలంటీర్లు ధర్నాందోళన నిర్వహించారు. సిఐటియు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో నాయకులు పెంచలనరసయ్య, అల్లాడి గోపాల్, వలంటీర్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు పెంచలయ్య మాట్లాడుతూ, వలంటీర్ల ఉపాధిని కాపాడాలన్నారు. బకాయి వేతనాలు చెల్లించాలని, వేతనాన్ని 10వేలకు పెంచుతామన్న హామీని నెరవేర్చాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. బలవంతంగా రాజీనామాలు చేసిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

# సీఎం సహాయ నిధికి.. 20 లక్షల విరాళం

## ఉదయగిరి దాతలను అభినందించిన ముఖ్యమంత్రి



విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఉదయగిరి నియోజకవర్గంలోని దాతలు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు అందజేసిన 20 లక్షలా, 3 వేల 655 రూపాయలను ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ ఇటీవల అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు చెక్కుల రూపంలో ఆ విరాళాన్ని అందజేశారు. వరద బాధితుల కష్టాలను తెలుసుకున్న ఉదయగిరి నియోజకవర్గంలోని నాయకులు, దాతలు స్వచ్ఛందంగా బాధితుల కోసం ఎమ్మెల్యే కాకర్లకు అందజేసిన ఆ చెక్కులను స్వీకరించిన ముఖ్యమంత్రి, కాకర్లను.. దాతల సేవాభావాన్ని అభినందించారు.

# మండలానికో మినీ స్టేడియం ఏర్పాటు చేయాలి

## అసెంబ్లీలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



కోవూరు నియోజకవర్గంలోని ప్రతి మండలంలో ఒక మినీ స్టేడియం నిర్మించేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇటీవల ఆమె అసెంబ్లీలో మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల పాఠశాలల్లో క్రీడా పరికరాలు, వ్యాయామ ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని, ప్రభుత్వం దృష్టిసారించి యువత క్రీడల పట్ల ఉత్సాహంగా ఉండేలా క్రీడావసతులు కల్పించాలన్నారు. తీర ప్రాంత మత్స్యకార గ్రామాలలో యువతరానికి క్రీడలపై ఆసక్తి ఎక్కువని, వారికి సరైన శిక్షణ ఇవ్వాలని, సౌకర్యాలు లేక క్రీడా రంగంలో వారు రాణించలేక పోతున్నారని ఆమె చెప్పారు. కోవూరు నియోజకవర్గంలోని విడవలూరు మండల కేంద్రంలో గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో అసంపూర్తిగానే వున్న మినీ స్టేడియం నిర్మాణాన్ని త్వరతగతిన పూర్తిచేయాలని కోరారు. యువత పెడత్రోవ పట్టకుండా ఉండాలంటే క్రీడలను ప్రోత్సహించాలని ఆమె అభిప్రాయపడ్డారు.

**మైపాడు అభివృద్ధికి సహకరించండి :**

కోవూరు నియోజకవర్గంలోని ఇందుకూరుపేట మండలం వద్ద సముద్రతీరంలో ఉన్న మైపాడు పరిసరాలలో శ్రీ చాముండేశ్వరి అమ్మవారి ఆలయంతో పాటు పలు దేవాలయాలు ఉన్నాయని, నిత్యం సందర్శకులు అటు ఆలయాలకు, మైపాడు బీచ్‌కు వస్తుంటారని, ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తే మైపాడు ప్రాంతం ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకుంటుందని తెలిపారు. సముద్ర తీర ప్రాంత పర్యాటక రంగంపై దృష్టి సారించాలని ఆమె పర్యాటక మంత్రిని కోరారు. దీంతో స్థానికులకు ఉపాధితో పాటు ఆ ప్రాంత అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. అందుకు, రాష్ట్ర పర్యాటకశాఖా మంత్రి కందుల దుర్గేష్ స్పందిస్తూ, మైపాడు బీచ్ అభివృద్ధికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు.

# ఆకట్టుకున్న.. 'శ్రీ శూద్ర గంగ' కావ్యపఠనం

## వివరించిన ప్రముఖ సినీకవి సుద్దాల అశోక్ తేజ



'విష్ణుపాదాల నుంచి ఉద్భవించిన గంగ పవిత్రమైతే, ఆ విష్ణుపాదాల నుంచే జన్మించిన శూద్రులు కూడా పవిత్రమైనవారే'నంటూ ప్రముఖ సినీకవి, ఉత్తమ జాతీయ చలనచిత్ర గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ అన్నారు. చెన్నైలోని 'వేద విజ్ఞాన వేదిక' ఆధ్వర్యంలో టీ-నగర్ ఆంధ్రాక్లబ్‌లో ఈనెల 24వ తేదీన తరతరాల తెలుగు కవిత-155వ ప్రసంగంగా 'శ్రీ శూద్ర గంగ' కావ్య పఠనం అందరినీ అలరించింది. సుద్దాల అశోక్ తేజ వక్తగా పాల్గొని ఆ కావ్యం విశిష్టతను తెలియజేశారు. తాను రచించిన ఆ కావ్యంలోని కొంతభాగాన్ని చదువుతూ, అందులోని విషయాలను వర్ణనాత్మకంగా విశదీకరించారు. గంగావతరణాన్ని ఆయన ఈ కావ్యంలో విలక్షణంగా, వినూత్నంగా ఆవిష్కరించడం అందరినీ ఆకట్టుకుంది. తొలుత, వేద విజ్ఞాన వేదిక కార్యదర్శి కందనూరు మధు స్వాగతోపన్యాసం చేశారు. అధ్యక్షులు జేకే రెడ్డి కావ్య రచయితను సభకు పరిచయం చేస్తూ, తెలుగు చలనచిత్ర రంగంలో సుద్దాల అశోక్ తేజ సుమారు 3వేలకు పైగానే అద్భుతమైన గీతాలు రచించి, ఎన్నో ప్రతిష్ఠాత్మకమైన అవార్డులందుకున్నారని ప్రశంసించారు. అనంతరం వేదిక నిర్వాహకులు మధు, జేకేరెడ్డి, ఆదాయపన్ను శాఖ ఉన్నతాధికారి డా. రాంజీరావ్ తదితరులు సుద్దాల అశోక్ తేజను ఘనంగా సన్మానించారు.

# టూకీగా...



## మాలకొండస్వామికి బియ్యం సమర్పణ

కందుకూరు నియోజకవర్గం వలేటివారిపాళెం మండలం మాలకొండలో వెలసివున్న శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి వారికి లింగసముద్రం మండలం రామకృష్ణాపురానికి చెందిన భక్తులు ఇటీవల 85 బస్తాల బియ్యాన్ని సమర్పించుకున్నారు. వాటిని ఆలయ కమిషనర్ కేవీ సాగర్‌బాబుకు అందజేశారు.

## ముంగమూరులో తల్లితండ్రులకు అవగాహన

బాల్యవివాహాలు చేయరాదంటూ బోగోలు మండలం ముంగమూరు అంగన్‌వాడీ కేంద్రంలోని తల్లులకు ఐసీడీఎస్ సీడీపీఓ సౌజన్య అవగాహన కలిగించారు. బాల్యవివాహాలు చేస్తే వారి జీవితాలు నాశనమవుతాయని, బాలలకు పెళ్ళిళ్ల చేయడం నేరమని చెప్పారు. ఎంపీటీసీ లలితమ్మ, సూపర్‌వైజర్ కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## కోడూరు బీచ్‌లో సందడే సందడి

ఆదివారం సెలవు కావడంతో తోటపల్లిగూడూరు మండలం కోడూరు బీచ్ సందర్శకులతో సందడిగా మారింది. జిల్లా నలుమూలల నుంచి, దూరప్రాంతాల నుంచి కూడా సందర్శకులు వచ్చి సముద్ర స్నానాలు చేశారు. బీచ్‌ఒడ్డున ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పర్యవేక్షించారు.

## పల్లిపాడులో ఉచిత పశువైద్య శిబిరం

ఇందుకూరుపేట మండలం పల్లిపాడులో స్వర్ణభారత్ ట్రస్టు మండవ ఫౌండేషన్, పశుసంవర్ధకశాఖలు కలసి ఈనెల 23న ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించి, జబ్బుపడ్డ పశువులకు చికిత్సలు చేశారు. వాటికి అవసరమైన మందులను ఉచితంగా ఇచ్చారు. ఫౌండేషన్ డాక్టర్ శ్రీనివాసనాయుడు, ముదివర్తిపాళెం వైద్యులు హరిబాబు, పశువైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## రాళ్లపాడు రైతులకు ఇక దిగుల్లేదు

సాగునీళ్ళ కష్టాలను ఎదుర్కొంటున్న రాళ్ళపాడు రైతులకు ఇక దిగుల్లేదు. కందుకూరు నియోజకవర్గంలోని రాళ్ళపాడు జలాశయానికి పుష్కలంగా నీళ్ళొచ్చాయి. ఈనెల 24 నాటికి ఆ జలాశయం నీటిమట్టం 17.5 అడుగులకు చేరుకుంది. మరో 2.5 అడుగుల నీళ్ళొస్తే పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకున్నట్లేనని, సాగునీటికి ఇబ్బంది లేదని రైతులు సంతోషిస్తున్నారు.

## కావలిలో లారీ ఢీ..ఆయా కన్నుమూత

కావలి పట్టణంలో ఆయాగా పనిచేస్తున్న గద్దె లక్ష్మమ్మ(46) ఇటీవల ట్రంకురోడ్డు కూడలిలో రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొని అక్కడికక్కడ మరణించింది. కావలి 1వ పట్టణ ఎస్ఐ సుమన్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. బాగా రద్దీగా ఉన్న ఆ కూడలిలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని జనం వాపోతున్నారు.

## వీరారెడ్డిపాళెంలో స్మశానానికి దారిలేక ఇక్కట్లు

విడవలూరు మండలం వరిణి పంచాయతీలోని వీరారెడ్డిపాళెం గిరిజన కాలనీ వాసులకు స్మశానానికి దారిలేక ఇబ్బందులు పడుతున్నారు. అక్కడి కాలువగట్టుపై ఉన్న దారి ఆక్రమణలకు గురికావడంతో ఈ దుస్థితి ఏర్పడిందని, ఎమ్మెల్యే.. అధికారులు పరిశీలించి శ్మశానానికి దారి ఏర్పాటు చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

## కేశవనగర్‌లో మధ్యాహ్నభోజనం పరిశీలన

కోవూరు పంచాయతీ పరిధిలోని కేశవనగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సక్రమంగా మధ్యాహ్న భోజనం పెడుతున్నారా లేదా అని ఎంఇఓ చెంచలక్ష్మమ్మ ఇటీవల ఆకస్మికంగా ఆ పాఠశాలను పరిశీలించారు. పాఠశాల వాతావరణం పరిశుభ్రంగా ఉండాలని, ప్రభుత్వం ఇచ్చిన మెనూ ప్రకారం విద్యార్థులకు అన్నం పెట్టాలని సిబ్బందికి చెప్పారు.

## పోతుకొండ అంకమ్మతల్లికి ప్రత్యేక పూజలు

రాపూరు మండలం తూమాయి గ్రామం వద్దనున్న గ్రామదేవత పోతుకొండ అంకాళమ్మ తల్లి ఆలయంలో ఈనెల 24న ప్రత్యేక పూజలు జరిగాయి. జిల్లాలోని పలుప్రాంతాల నుంచి భక్తులు పాల్గొని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.

# ప్రమాదాల నివారణపై రవాణాశాఖ దృష్టి

## • రహదారులని సందర్శించిన డీటీసీ చందర్



జిల్లాలో విస్తరించి వున్న వివిధ రహదారులపై నిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణపై రవాణా శాఖ దృష్టి సారించింది. రహదారులు – వాహనాల భద్రత అంశంపై గత మాసం జిల్లా కలెక్టర్ ఆనంద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రహదారులపై జరుగుతున్న ప్రమాదాలకి గల కారణాలని అధ్యయనం చేసి, ప్రమాదాల నివారణకు అవసరమైన తగు చర్యలు తీసుకోవాలని ఆ సమావేశంలో తీర్మానించారు. జాతీయ రహదారి నెం.16, 67, 565లలో గతంలో గుర్తించిన 54 ప్రమాదకర ప్రాంతాలలో, ప్రమాదాల నివారణకి కేంద్రప్రభుత్వ ఆధీనంలోని జాతీయ రహదారుల శాఖ అధికారులు తీసుకున్న చర్యలను కూడా పర్యవేక్షించాలని నిర్ణయించారు.

ఈమేరకు నెల్లూరుజిల్లా ఉప రవాణా కమిషనర్ బీ.చందర్ తమ సిబ్బందితో పాటు పోలీస్, జాతీయ రహదారులు, రోడ్లు మరియు భవనాలు, మునిసిపల్ శాఖ వారితో కలసి జిల్లాలో ఉన్న రహదారులను మూడు రోజుల పాటు సందర్శించి అధికారులు తీసుకుంటున్న చర్యలను పర్యవేక్షించారు. ఇదే సందర్భంలో జాతీయ రహదారులపైన ఉన్న మద్యం దుకాణాలపై కూడా నివేదిక తయారుచేశారు. తదుపరి జరిగే రహదారులు – భద్రత సమావేశాలలో డీటీసీ చందర్ తమ నివేదికని సమర్పించనున్నారు.






శ్రద్ధాంజలి

ప్రజాసేవలో ధన్యం మీ జీవితం
ప్రజలు మరువరు మీ సేవలు

కీ॥ శే॥ శ్రీ మాగుంట సుబ్బరామరెడ్డి గారు
ఒంగోలు పార్లమెంటు మాజీసభ్యులు

29వ వర్ధంతి సందర్భంగా
వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ...

కుటుంబ సభ్యులు
మరియు బంధుమిత్రులు

తేది: 1-12-2024 ఆదివారం ఉ॥ 10.30 గం॥లకు నెల్లూరు, పొగతోటలోని M1 సినిమాస్(S2 సినిమాస్)లో
మహనీయులు కీ॥శే॥ మాగుంట సుబ్బరామరెడ్డి గారికి స్మృత్యంజలి ఘటిస్తారు.

Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com